కాలజ్ఞానసుధ
ఆధ్యాత్మిక మాస పత్రిక
జూలై - 2015 సంపుటి:19 సంచిక:7




# విషయ సూచిక

| | |
|---|---|
| సంపాదకీయం - గురువే గొప్ప సంస్కర్త | 4 |
| ముగింపు ప్రారంభమయితే | 6 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత (వర్ణధర్మములు) | 9 |
| వేదపరిచయము | 12 |
| అనుసరణీయం - ధర్మరాజు మార్గం | 14 |
| ఆది గురువు ఆచార్య శంకరులు | 16 |
| యోగవాసిష్ట కథాలహరి - బలిచక్రవర్తి మోక్షసాధన | 18 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 21 |
| ఆచార్యముపసంగమ్య | 25 |
| శ్రీరామ భక్తి ( వాల్మీకి మహర్షి శ్రీరామభక్తి) | 26 |
| రఘువంశం | 28 |
| మహాభారతంలోని నీతి కథలు | 31 |
| దైవభక్తి | 33 |
| దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు (ఉండవల్లి) | 36 |
| వివిధ వ్యాధులు ఆయుర్వేద చికిత్సలు | 38 |

ముఖచిత్రం: గురుదేవులు శ్రీశ్రీశ్రీ 'యోగి' అచలానందస్వామి వారు

**ఈ నెల సూక్తి**

మండుటెండల్లో మేఘానికి కోపం వస్తే ఏం చేస్తుంది? తన నీటితో నేలను చల్లబరుస్తుంది. సత్పురుషుల కోపం కూడా అంతే! అది మరొకరికి మేలు చేయడానికే ఉపయోగపడుతుంది.



**చందా వివరములు**

జీవిత చందా (20సం॥) : 1116/-
సంవత్సర చందా : 70/-

చందాలు పంప వలసిన చిరునామా:
**కాలజ్ఞాన సుధ**
శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు - 523 002 ప్రకాశం జిల్లా, (ఆం. ప్ర)
ఫోన్స్: 08592/235341, 9949132469,
9705555229, 8977799289

సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు

సంపాదకీయం

# గురువే గొప్ప సంస్కర్త

**తేది 31-7-2015 గురుపూర్ణమ సందర్భంగా...**

గురులు శిష్యులెల్ల పరిపాలనాపరుల్
పారమార్థికులుగ ప్రబలిరేని
సంఘమందు సుఖము శాంతి వర్థిల్లును
కాళికాంబ! హంస! కాళికాంబ!

పై పద్యం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారిచే చెప్పబడింది. పాలకులు గురుబిడ్డలైనట్లైతే సంఘం ప్రశాంతంగా సాగిపోతుందంటారు స్వామి.

పూర్వాపు రాచరిక వ్యవస్థను పరిశీలించినట్లైతే ప్రజలకు స్వచ్ఛమైన పాలనను అందించిన వారిలో అత్యధికులు గురువులను ఆశ్రయించినవారే వున్నారు. శ్రీకృష్ణదేవరాయలువారి పాలనను గురించి నేటికీ ఎంతో కీర్తిస్తుంటారు. కాని ఆయన అలా పాలించటానికి కారణం గురువుగారి ఆశయాలను పాటించాడాయన. కళింగ యుద్ధం ద్వారా కనువిప్పుగలిగిన అశోకుడు ఆ తరువాత బౌద్ధమతాన్ని స్వీకరించి ప్రజా రంజకంగా పాలించాడు. ప్లెటో, అరిస్టాటిల్ గురు సాంప్రదాయంలో సాగిన వారే, వారి బోధనలునేటికీ ఆదర్శప్రాయమే.

సామాన్యుడు గురువును ఆశ్రయించిన తరువాత అతని జీవనసైలిని మార్చుకుంటాడు. అసంబద్ధ విషయాలను ఒక్కొక్కటిగా తొలగించుకుంటూ క్రమంగా సజ్జనుడుగా మారతాడు. ముఖ్యంగా ఆధ్యాత్మిక గురువులు శిష్యుని సన్మానమార్గంలో నడిపిస్తారు. అతనిలో బలహీనతను పారద్రోలి, సదాచార వంతునిగా చేస్తారు. సామాన్యునికీ తెలిసీతెలియని లోపాలు కనిపిస్తుంటాయి. పరమ గురుని సాంగత్యంతో వారు ప్రమాణికమైన వ్యక్తులుగా మారుతుంటారు. అలాకాని పక్షంలో గురువునాశ్రయించినవారికి ఆశ్రయించనివారికీ తేడా ఏముంటుంది. 'గురుని మరులేని నరులు నాశనమైరి, మరులు గలుగు నరులు మరల రారు" అన్నారు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారు. అంటే గురుబోధనలను ఆచరించినవారికి మోక్షం ప్రాప్తిస్తుందని స్వామివారి సందేశం.

గురువు సాక్షాత్ పరబ్రహ్మ. లోకహితార్థమై వచ్చి శుద్ధ చైతన్యమే గురువు బాలక జీవితంలోని లోపాలను, అసంబద్ద విషయములను తొలగించి మంచి మార్గంలో నడిపిస్తూ వారిలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలించి, దానిని ప్రజ్వలింపజేసి పునీతులను చేస్తాడు గురువు. అది ఒక్క గురువుకే సాధ్యం దైవం చేయనిది గురువు మాత్రమే చేసేది ఇది. అందుకే మోక్ష గాములైనవారు

గురువునాశ్రయిస్తారు. వారి ఆజ్ఞ ప్రకారం సాధన చేసి స్వీయజీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటారు.

అజ్ఞానంధకారంలోవున్న కక్కయ్య శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామివారిని ఆశ్రయించి జ్ఞాని అయినాడు లోకోత్తరుడయ్యాడు.

జ్ఞానార్తి కోసం రాజ్యాన్ని వదలుకొనదలచిన ఆనందభైరవుడు శ్రీ వీరంభొట్లయ్య స్వామిని ఆశ్రయించి తరించాడు. యోగి అయినాడు, ఆనంద భైరవ యోగిగా ప్రసిద్ధి గాంచాడు శ్రీ కృష్ణుని ఆశ్రయించిన అర్జునుడు అసాధ్యమైన కురుక్షేత్ర సంగ్రామంలో విజయం సాధించి విజయుడైనాడు. ద్రోణుని గురువుగా సేవించిన ఏకలవ్యుడు ఉన్నత శిఖరాలనందుకున్నాడు. ఎన్నో అవలక్షణాలు కలిగిన చలంగారు, రమణ మహర్షి నాశ్రయించి పదుగురిచేత కీర్తించబడ్డాడు. నేడు ప్రపంచమంతా కీర్తిస్తున్న వివేకానందుడు, శ్రీ రామకృష్ణ పరమహంస గారిచే తీర్చిదిద్దబడిన ఆధ్యాత్మిక సమ్మోహనశక్తి.

అలా ఎందరో మహనీయులు గురువు శుశ్రూషచేత తరించారు. భావితరాల వారికి ఆదర్శప్రాయులైనారు. సర్వకర్మలను తొలగించి శిష్యుని పరమపవిత్రుని చేసి, మోక్ష సామ్రాజ్యానికి అర్హునిగా చేసేవాడు గురువు, శిష్యునిలోని సకల లోపాలను సరిదిద్దె మహాశక్తి గురువు.

భారతావనిలో గురువులకు కొదువలేదు, ఆశ్రయించేవారికి అందుబాటులో వున్నారు మహనీయులు. ప్రపంచంలో ఎన్నో దేశాలవారు భారతావనికి వచ్చి పరమ గురువును ఆశ్రయిస్తున్నారు. వారి సందేశాన్నందుకొని పరమశాంతిని పొందుతున్నారు. అదృష్టవంతులు పరమగురువులనాశ్రయిస్తారు. ఆధ్యాత్మిక జీవన శైలితో జీవితాన్ని తరింపజేసుకుంటారు. మీరు ఉద్యుక్తులుకండి! పరమ గురునాశ్రయించండి! సుదీర్ఘ జీవనయానానికి చరమగీతం పాడండి. పరమపదసోపానాన్ని అధిరోహించండి!

భగవత్సేవలో.... సంపాదకులు

- సజ్జనసాంగత్యమనే కప్పక్రింద మనం నిలబడి వున్నట్లైతే దుర్గుణాలనే జడివాన మనల్ని స్పృశించలేదు.
- ప్రతి మనిషీ తనలో ఒక అడవిని పెంచుతున్నాడు. అందులో ఈర్ష్యాద్వేషాల వంటి విషవృక్షాలు ఉన్నాయి. కామక్రోధాదులనే క్రూరమృగాలూ ఉన్నాయి. వీటన్నింటితో పాటు ప్రేమ దయ వంటి వనమూలికలూ పెరుగుతున్నాయి. కనుక తనలోని ఈర్ష్యా ద్వేషాలనే విషవృక్షాలను నరికివేసి, కామక్రోధాలనే క్రూరమృగాలను పారద్రోలి, ప్రేమ దయ మొదలగు వనమూలికలతోకూడిన ఉద్యానవనమును మాత్రమే పెంచుకోవాలి.

# ముగింపు ప్రారంభమయితే

....... జి.వి. శేషారెడ్డి

మానవజన్మ ఉత్కృష్టమైనది. 84 లక్షల జీవరాశులలో మానవజన్మ మహోన్నతను కలిగి విచక్షణా జ్ఞానముతో మంచి, చెడులను, ధర్మ, అధర్మలను, నీతి, అవినీతులను విశ్లేషించగలదు. మానవుని మేధస్సు అపారము, తన మేధాసంపత్తితో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతూ తనకు అసాధ్యమన్నది ఏది లేదన్న స్థితిలో మానవుడున్నాడంటే ఆతిశయోక్తికాదు. కాని మానవజీవితాన్ని అశాంతి, అస్థిరత్వము, అలజడి, ఆందోళనలు, పీడిస్తున్నాయంటే తన ఆలోచనా సరళి మారాలి కదా! చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొన్న చందాన కాకుండా, చేతులు కాలకుండా జాగ్రత్తపడితే మానవజీవితము మూడు పువ్వులు, ఆరుకాయలుగా విరజిల్లుతుంది. అందుకే ముగింపు ప్రారంబమయితే ప్రతిమనిషి ప్రేమను పెంచుతాడు, పంచుతాడు, శాంతినిఆహ్వానిస్తాడు. శాంతి జీవనానికి తహతహలాడుతాడు. ఆందోళన చెందడు, స్థిత ప్రజ్ఞుడవుతాడు.

అనుభవము పాఠాలను నేర్పుతుంది. మహానుభావులు వారి అనుభవాలను 'స్వీయచరిత్ర'' ల ద్వారా ఈ లోకానికి తాము చరిత్రలో ఏలా చోటు సంపాదించుకోన్నారో సవివరముగా వివరిస్తూ, ఈ తరంవారు. ఎలా వ్యవహరిస్తే, ఉన్నత ప్రమాణాలు కలిగిన జీవితాన్ని గడపగలరో విశ్లేషించారు. అందుకే ప్రతి మనిషి జీవితము అరటిపండు వలిచి అందించినట్లుగా, మలచుకోవడానికి సూచనలు, మహానుభావుల జీవిత చరిత్రలు కలిగియున్నాయి. ప్రతి మనిషి అంత్యదశలో నేను ఇలా చేసి ఉండి ఉంటే చాలా భాగుండేది అని భావించడము సహజము. చివరి దశలో పశ్చాత్తాపముతోగాని, ప్రాయిశ్చిత్తముతోగాని, పరితాపముతోగాని, విశ్లేషణతోగాని మానవుడు తనను, తాను సంస్కరించుకోవడానికి ప్రయత్నము చేసుకోవడం సహాజము. కాని అది ఆఖరిదశ అయినందువల్ల చేయవలసిన పనులన్ని పూర్తి కానప్పుడు కర్మ విమోచనము కాలేదు. అందుకే ''ముగింపు ప్రారంభమయితే'' కర్మ సిద్ధాంతాన్ని నమ్మిన మనమందరము కర్మభందం నుంచి విముక్తలము కాలేమా! ''ముగింపు ప్రారంబమయితే'' కర్మ సిద్ధాంతము ప్రారంభం కావడానికి నేర్చుకోవలసిన పాఠాలను మహానుభావుల నుంచి, వారి పుణ్యకార్యాలద్వారా, ధర్మ నిరతి ద్వారా మనకు తెలుపుతున్నారుకదా! మనలను మనము సంస్కరించుకోవడానికి తెలిసిన పాఠాలెన్నో, వాటిని ఆచరిస్తే ముగింపు ప్రారంభము కాదా! మానవజన్మ తరించదా!

ఈ కర్మ భూమిలో ఆదర్శపురుషులు, అమృతమూర్తులు కోకొల్లలు, వారి జీవితాల సిద్ధాంతాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిచ్చే ఆలోచనలు, వారి క్రమశిక్షణ, అంకితభావం, ఆత్మస్థైర్యము మనందరికి ప్రేరణ అయితే మానవుల జీవితాలు నందనవనాలేకదా! ''నీ విధికి నీవే శిల్పివి'' అన్నాడు

స్వామి వివేకానందుడు. ఈ సూక్తిని విశ్లేషిస్తే మన వాస్తవానికి మనమే సృష్టికర్తలం. వట విత్తనం నాటితే వటవృక్షమే వస్తుంది. అందుకే మన భావాలు, చేష్టలు వదిలి, మహానుభావులను ఆదర్శంగా తీసుకొని, మన పరిసరాలకు అనుగుణంగా మార్చుకోగలిగితే ప్రతి మనిషి జీవితం స్వర్గదామమేకదా! చివరి శ్వాస వరకు చేవ తగ్గకపోతే మానవజన్మకు సార్థకత లభిస్తుంది. ప్రతి మనిషి జీవితము తెల్లకాగితమే, ఆ కాగితములో మనము చేసే ప్రతిపని చరిత్రను సృష్టించేది అయిఉంటే, జీవితం ఎంతో గొప్పగా మలచుకోగలము కదా! అందుకే ఆలోచనలు మన ముఖాన్ని అద్దంలో చూచుకొని మెరుగులు దిద్దుకోనే తీరుగా మనకున్న ఆలోచనతో ఎదగాలి. వాటిని గమనించి, విశ్లేషించాలి. ఆ ఆలోచనలకు అంతము ఉండదు. తేనె తుట్టే, తేనె టీగలకు పెట్టె, అదేమాదిరి మెదడుతుట్టలో ఆలోచనల పెట్టె కలదు.

విధిని ఎదిరించవచ్చు విశ్వాసముంటే, విశ్వాసముంటే విశ్వాన్ని జయించవచ్చు. అందుకు పని ప్రారంభము, విశ్వాసముతో జరగాలి. విశ్వాసముతో ఏ పనినైనా ప్రారంభిస్తే చేయవలసిన విధిని ముందుగానే ఆలోచించగలము. మన జన్మకు సార్థకత చేకూర్చే బాధ్యతాయుతమైన నడవడికను కలిగి ఉంటాయి. మనిషి జీవనమనుగడకు ఆలోచనలు ఆధారం. ఆదిమ మానవుడు నుంచి ఆధునిక మానవుడి వరకు వచ్చిన పరిణామాలను ఏ రంగంలోనైనా గమనించినా ఈ అభివృద్ధి తన ఆలోచనలకు విశ్లేషణ జోడించి, శోధన చేసి, పరిశోధన చేసి ఆలోచనలకు పరిపూర్ణత్వాన్ని, ఆపాదించి, ఛేదించి, పరిచ్ఛేదించి, గమ్యాన్ని గమనించి, గుర్తించి వివిధ రంగాలలో అద్వితీయమైన, గణనీయమైన అభివృద్ధిని సొంతము చేసుకోన్నాడు. నాటి ప్రపంచానికి, నేటి ప్రపంచానికి'' నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా కలదు. మహానుభావుల చరిత్ర ప్రతి మానవుడికి ఆదర్శం కావాలి. అందులోని ప్రతి విషయాన్ని గమనించాలి. తనకు అన్వయించుకోవాలి. తనకున్న పరిస్థితులచుట్టూ వాటిని తన విధినిర్వహణలో గమనిస్తే, మనము మన జీవితాలను, వెన్నెల కాంతులతో నింపుకోవచ్చు. మనిషి ఆలోచనలే, జీవిత పయనాన్ని నిర్ణయిస్తాయి. "జీవితం సమరం" ఈ నిత్య సమరంలో మనిషి సైనికుడి తరహా ఎప్పుడూ కూడా, ఏ విపత్తునైనా ఎదుర్కొనడానికి సన్నద్ధుడై ఉండాలి తప్ప అలసత్వాన్ని ప్రదర్శించకూడదు. మన వాస్తవాలకు మనమే సృష్టికర్తలం. ఏ విత్తనము నాటితే ఆ చెట్టే వస్తుంది. అందుకే ఆలోచనలు బట్టే జీవితాలు సాగుతాయి. "ఆలోచనే వేరు'' చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడం వల్ల ప్రయోజనం యుండదు. అందుకే ప్రతి జీవితానికి ఒక ప్రణాళిక ఉండాలి. "ప్రణాళికతో కూడిన జీవితం నందనవనం'' 'Look before you leap' అన్నారు. అంటే పనిచేసే ముందు దాన్ని పుర్వాపరాలు, మంచి చెడ్డలు ఆలోచించమని కదా! కావాలసినంత సమాచారము మహనుభావులెందరో వారి అనుభవాలను రంగరించి, ఈ లోకానికి గ్రంథ రూపాల్లో ఎన్నో అద్భుతమైన జీవిత సత్యాలను తెలియజేస్తాయి. వాటన్నింటిని అవపాసనచేసుకోని అమలుపరిస్తే, ప్రతి జీవితము పూలబాటే కదా! అన్నీ తెలుసు అమలు చెయ్యము. కొంత మంది భోదిస్తారు, అమలు చెయ్యరు. చెప్పిందే ఆచరించాలి. ఆచరించి మన జీవితం ఇతరులకు ఆదర్శం కావాలి. "మెలుకువతో కూడిన అణుకువ'' అత్యవసరం. తల్లి,

తండ్రి, గురువు, దైవం అన్నారు. దైవాన్ని నాలుగోస్థానానికి చేర్చడానికి కారణం, జన్మనిచ్చిన తల్లిదండ్రులు. మొదటి రెండు స్థానాల్లో, తమ బిడ్డల జీవితాలను ఆణిముత్యాల రీతిగా తీర్చిదిద్దడానికి, గురువు మూడోస్థానములో ఒక శిల్పిబండరాయిని అద్భుతతమైన శిల్పంగా తీర్చిదిద్దడానికి తన ప్రతిభను, నైపుణ్యాన్ని ఉపయోగిస్తాడు. శిల్పిలాగా గురువు తాను బోధించే విద్యతో ప్రతి విద్యార్థిని ఉత్తమ ఆదర్శపౌరుడుగా, విశ్వమానవ స్వేచ్ఛ దృక్పదానికి నాంది పలకాలి. "యతే భావం తథేభవతే" అందువల్ల తల్లిదండ్రుల పెంపకము, గురువు గారి భోదన ఏ వ్యక్తినైనా ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతుంది. తల్లి భోదించిన నీతి కథలు, అహింసా సిద్ధాంతం గాంధిగారికి మహాత్మునికి మంచి అసాద్యము అనుకొన్న భారత స్వాతంత్ర్యాన్ని సాధించాడు. నేను ప్రపంచమంతా అహింసా సిద్ధాంతముతో అసాధ్యమనేది లేదన్న, యధార్థాన్ని ప్రపంచానికి చాటిచెప్పి, ఆయా దేశాలలో ఎందరెందరు మహానుభావులు, రాజకీయనాయకులు ఆయ దేశాలలో అనూహ్యమైన విజయాలను సొంతము చేసుకొన్నట్లు మనము చూస్తూనే ఉన్నాం. ఉదాహరణకు అమెరికాలో మార్టిన్ లూథర్‌కింగ్, దక్షణాఫ్రికాలో నల్లని సూరీడు నెల్సన్ మండెలా అహింసా సిద్ధాంతాన్ని ఊపిరిగా వారు చేధించాలన్న గమ్యాన్ని అలవోకగా చేశారు కదా!

పుట్టుక వెంట ఎప్పుడూ కూడ మృత్యువు ఉంటుందన్న సత్యాన్ని గ్రహించినపుడు తాను చేయవలసిన ప్రతి పనిని మానవుడు నిబద్ధతో, ప్రణాళికాయుక్తంగా చేస్తాడన్నది నగ్నసత్యం. నానాటికి బ్రతుకుబూటకమని, ఈ భ్రతుకు మున్నాళ్ళ ముచ్చటని గమనించి, మనిషి బాధ్యతలను మరువకుండా నిర్వహించవలసిన పనులన్నింటిని సక్రమముగా నేరవేర్చిననాడు కర్మ సిద్ధాంతాన్ని అనుసరిస్తున్నట్లే!

మానవజన్మ ఒక పరిక్ష "ఎంతచెట్టుకు అంతగాలి". దైవం ప్రతి మనిషిని పరీక్ష చేయడానికి ఎన్నో ఉపద్రవాలు సృష్టిస్తాడు. వాటన్నింటిని ఎదుర్కోన్న నాడే మానవుడు పూర్ణత్వాన్ని పొందగలడు. "పూర్ణత్వమే బుద్ధత్వము. బుద్ధత్వమే గీతాతత్వము," అన్ని మతాల సారాంశము. చివరిదశలో చింతించేకన్నా ప్రారంభదశలో, చివరగా చేయాలనుకొన్నవన్ని చేయకలిగినపుడు జీవితం నందన వనమేకదా! సత్యాన్ని గ్రహించి సతమతమౌతున్న మనస్సును మదుపుచేసి సత్యంకోసం నిత్యం చేసే ఆరాటం బ్రతుకు భాటను పూలభాటగా చేయడం ఖాయం. ఎందరో మహానుభావుల జీవిత చరిత్రలు ఇందుకు నిదర్శనం.యువతగా ఉన్నప్పుడే భవిష్యత్‌ను [illegible] పరిశీలిస్తే పరమాత్మను దర్శించుకోవచ్చునన్న సత్యాన్ని గ్రహించి, చివరి దశలో చేయవలసిన పనులన్నీ యువకుడు చేసినపుడు ఆదర్శమూర్తిగా, మహానుభావుడుగా జగతికికెక్కుతాడు. ●

- సరదాలనే గింజలను అదే పనిగా నానబెడితే అలవాట్లనే మొక్కలు పుట్టుకొస్తాయి. వాటినలా పెంచుకుంటూపోతే సమస్యలనే మాకులు తయారవుతాయి.
- నియమం లేని జీవితం గట్టులేని చెఱువు లాంటిది. విశేషించి చూపా లంటే విలువైన ఆధారమేదీ అక్కడ కనిపించదు.

# సనాతన ధర్మము - దాని విశిష్టత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్: 09410990829

(గత సంచిక తరువాయి)

## 18. వర్ణ ధర్మములు

వ్యాసమహర్షి మహాభారతములో క్రింది విధముగా చెప్పినాడు :

**శ్లో॥ జన్మనా జాయతే శూద్రః కర్మణా ద్విజ ఉచ్యతే।**
**వేదపాఠేన విప్రత్వం బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణః॥**

ప్రతి మానవుడు జన్మించినపుడు శూద్రుడే! మనిషి పెరిగే కొలదీ ఎవడైతే వేదాల్ని పఠించి, వేద విజ్ఞానంతో బ్రహ్మజ్ఞానాన్ని పొంది, వేదవిజ్ఞానాన్ని ఇతరుల కోసం వినియోగిస్తాడో - వాడే బ్రాహ్మణుడు. జన్మతో బ్రాహ్మణ్యం లభించదని మహాభారతం స్పష్టంగా చెప్పుచున్నది.

మరియు ఇట్లనుచున్నది -వేదాలు, సత్యం, ధర్మం, ఆచారం, తపస్సు-ఈ ఐదింటికి ఉనికిపట్టుగా నున్నవారే బ్రాహ్మణులు. బ్రాహ్మణుడనే వాడు ఎల్లవేళల ప్రశాంతతతో ఉండాలి. ఒకరికి భయపడకుండా, ఒకరిని భయపెట్టకుండా ప్రవర్తించే విశాల హృదయుడే బ్రాహ్మణుడు.

బ్రాహ్మణ ధర్మములు తొమ్మిది. అవి - వేదములను చదివించుట, చదువుట, యజ్ఞములు చేయుట, చేయించుట, ప్రతిగ్రహము, ప్రశాంతి, తపస్సు, సత్యము, శౌచము. ఈ ధర్మాలను పాటించుచున్న వారెవరైననూ బ్రాహ్మణులే. పుట్టుకతో బ్రాహ్మణుడైనా, ఈ ధర్మముల నాచరించని యెడల అతను శూద్రుడుగానే గణింపబడునని పెద్దల నుడివి.

ఈ సత్యమును ఈ క్రింది సూక్తి దృఢపరచుచున్నది.

**శ్లో॥ యో అనధీత్య ద్విజో వేదాన్ అన్యత్రకురుతే శ్రమమ్।**
**స జీవన్నేవ శూద్రత్వం ఆశు గచ్ఛతి సాన్వయః॥**

'ద్విజ జన్మ నెత్తి వేదములు చదువకుండ లౌకిక విద్యలు ఆర్జించినవారు జీవించి ఉండగనే వంశముతో సహా శూద్రత్వం పొందెదరు'.

మానవులంతా ఒకే జాతికి చెందినవారని ఈక్రింది సూక్తి చెప్పక చెప్పుచున్నది.

**"ఆకృతి వ్యంగ్యా జాతిః" "ఆకృతి విశేషముతో తెలియబడునది జాతి"**. పశు, పక్షి, పాము, మొదలగునవి జాతులు. చూచుట తోడనే ప్రత్యేక చిహ్నములతో తెలియబడుచున్నవి.

మానవులంతా ఒకే చిహ్నములను కలిగియున్నారు గనుక వారంతయు ఒకే జాతికి చెందినవారని పై సూక్తి తెలుపుచున్నది.

జన్మతః బ్రాహ్మణ్యం లభించదని మరియొక్క సూక్తి మహాభారతములోని వనపర్వములో చెప్పబడినది :

**శ్లో॥ నయోనిర్నాపి సంస్కారో న శ్రుతం న చ సంతతిః ।**
**కారణాని ద్విజత్వస్య వృత్తమేవ తు కారణమ్॥**

'పుట్టుకగాని, సంస్కారములుగాని, వేదాధ్యయనముగాని, వంశపారంపర్యంగాని బ్రాహ్మణత్వమునకు కారణము కానేరవు. ఒక్కసదాచారము (విధ్యుక్త కర్మల నాచరించుట) మాత్రమే కారణమగును.

పై నిదర్శనములను బట్టివర్ణ విభజన గుణకర్మలను అనుసరించి చేయవలయునేగాని,

పుట్టుక ననుసరించి కాదని తేలుచున్నది.

పుట్టుకను బట్టి వర్ణవిభజన గావించి, దానిని మనపూర్వపు రాజులు అమలులో పెట్టుట మూలమున మన దేశము అనేక ఇక్కట్లు పాలు కావలసివచ్చినదని శ్రీమళయాళస్వామివారు పేర్కొన్నారు.

పూర్వము, రాజులు తమ సైన్యములోనికి వ్యక్తులను తీసికొనునపుడు ఒక క్షత్రియులకు మాత్రమే ప్రవేశము నిచ్చుచుండిరి. క్షత్రియులు మాత్రమే యుద్ధములో పోరాడుట కర్హులని వారి ఉద్దేశ్యము. అందువలన, తగు సంఖ్యలో వ్యక్తులు లభించక వారి సైన్యములను విస్తారము చేసికొనలేకపోయిరి. అపుడు మహమ్మదీయులు మొదలగు విదేశీయులు దండెత్తి వచ్చి, వారిని సులువుగా ఓడించగలిగిరి. ఆ విధముగా మన దేశము విదేశీయుల పాలయినది.

ఈనాటి మన ప్రభుత్వము జాతి విచక్షణ లేకుండా సైన్యములో చేరుటకు ఆసక్తిగల వ్యక్తులలో అర్హతగల వారినందరిని తీసికొనుట వలన ఈనాడు మన సైన్యంను విస్తారము చేసికొనగలుగుచున్నాము.

కులతత్త్వము వలన సంభవించిన మరియొక అనర్థము 'మతమార్పిడి'. మన సమాజము కొన్ని జాతులవారిని నిమ్మజాతులవారని, అంటరాని వారని కేటాయించి, వారిని అగౌరవపరచిరి. వారిని మహమ్మదీయులు, క్రైస్తవులు గౌరవించి, వారికి అనేక నదుపాయములు కల్పించి, వారిని తమ మతములోనికి తీసికొనిరి.

ఇంకను మరియొక అనర్థము వర్ణవిభజన వలన నంభవించుచున్నది. అదియేమనగా 'అవాంఛనీయమైన అనుకరణ'. ఉన్నత జాతివారిని అనుకరింప జూచుదురు మిగిలిన జాతులవారు. బ్రహ్మణులను ఆదర్శముగా తీసికొని మిగిలిన సమాజమంతయు చెడిపోవుట ఆస్కారముగలదు. పూర్వకాలములో బ్రాహ్మణులు సదాచార సంపన్నులై మిగిలిన వర్ణముల వారికి ఆదర్శప్రాయులుగా మెలగుచుండిరి. కాని, ఈనాటి పరిస్థితి వేరుగా నున్నది.

వర్ణవ్యవస్థలో నున్న మాలిన్యాన్ని, భారతీయ సంస్కృతిని క్షుణ్ణంగా అధ్యయనము చేసిన అనిబిసెంట్ సూటిగా, క్లుప్తముగా మూడు ముక్కల్లో చెప్పింది. "బ్రహ్మణ శరీరములో నున్న శూద్ర జీవాత్మ సనాతన దర్మమునకు చాలా గొప్ప ప్రమాదకరమైనది".

ఈ ఒక్క వాక్యమే చాలును మన వర్ణవ్యవస్థలో నున్న లోపముల నెత్తిచూపుటకు. ఒక వ్యక్తి బ్రాహ్మణకులములో జన్మించినప్పటికి అతనిలో నున్న జీవాత్మ శూద్రగుణములను కలిగియుండిన యెడల, అతడు సనాతన ధర్మము ప్రబోధించుచున్న స్వదర్మముల నెట్లు నిర్వర్తింపగలడు! అతడు సమాజమునకు ఆదర్శపురుషుడెట్లు కాగలడు! అతని గుణస్వభావముల ననురించి అతని కర్మలుండును గదా! కావున జన్మతః సంభవించిన వర్ణము అసంగతమగుచున్నది గదా! ఈ కారణము చేత పుట్టుకను బట్టి వర్ణవిభజన చేయుటయు అసంగతమే యగుచున్నది గదా!

ఈ సందర్భములో రెండు చక్కని నిదర్శనములను మనము చర్చించెదము. భాగవత పురాణములో చెప్పబడిన అజామిలుని చరిత్ర మనకు తెలిసినదే గదా! అతడు బ్రాహ్మణకులములో జన్మించినప్పటికి, విషయలోలుడై, అన్ని దురలవాట్లకు లోనయి, శూద్రుని కంటెను అధోగతి పాలయు, పతనమయినాడు.

రెండవ నిదర్శనము - డాక్టర్ అంబేద్కర్. అతడు శూద్రజాతిలో పుట్టినప్పటికి, ప్రయత్నపూర్వకముగ సద్గుణసంపన్నుడై ఎంతో ఉన్నతస్థాయికి ఎదగగలిగినాడు. విదేశములలో విద్యనభ్యసించి డాక్టరేట్ పట్టాను గూడపొంది, అతిమేధావియని ప్రసిద్ధికెక్కి, సమకాలీనులైన గాంధీ, నెహ్రూలచేత గూడ గౌరవింపబడి, భారతీయ రాజ్యాంగ చట్టమును రూపుదిద్దినవారిలో ప్రథముడుగా వినుతికెక్కినాడు.

కావున, అనిబిసెంట్ చెప్పిన సూక్తిలో చాలా నిగూఢమైన అర్థము స్ఫురించుచున్నది.

కృష్ణభగవానుడు సృష్టించిన వర్ణవ్యవస్థను గురించి కొంచెము విపులముగా పరిశీలింతము :

గుణకర్మల విభాగము ననుసరించి చేయబడిన ఆ నాల్గువర్ణములు శ్రమవిభజన కనుకూలముగా చేయబడినవియేగాని, శాశ్వతమైన వర్ణ వ్యవసస్థను ఏర్పరచుటకు కాదు అనెడి విషయము మనకవగతమగును కొంచెము నిశితముగా ఆలోచించిన యెడల. ఈ విషయమును సోదాహరణముగా పరిశీలించెదము.

ఉదాహరణకు, 'ఎ' అను వ్యక్తి ఉన్నాడు. ఆ వ్యక్తి యొక్క గుణకర్మలను బట్టి అతనిని 'శూద్రునిగా నిర్ణయించినాము. అతని పుత్రుడు 'బి' యను వాడు గత జన్మల సంస్కారము చేత సద్గుణసంపన్నుడై, సకల శాస్త్ర పారంగతుడై, బ్రహ్మజ్ఞానమును బడసి 'బ్రాహ్మణు'డైనాడు. అతని పుత్రుడు'సి' యనువాడు వ్యవసాయమునందు, గోరక్షణయందు, వాణిజ్యమందు అభిలాష గలిగియుండి 'వైశ్యుడు' అయినాడు. అతని పుత్రుడు 'డి' యనువాడు పరిపాలనాదక్షతను, ధైర్యశౌర్యములను గలిగియుండి 'క్షత్రియు'డయినాడు.

కావున, ఈ గుణకర్మల విభాగము ప్రకారము వ్యక్తుల యొక్క వర్ణము తరతరమునకు మారుచునేయుండును. తండ్రియొక్క వర్ణము వేరు, కుమారుని వర్ణము వేరు, మనుమని వర్ణము వేరు, ముని మనుమని వర్ణము వేరు - ఈ విధముగా తర తరమునకు వర్ణము మారుచునే యుండును. కాబట్టి శాశ్వతమైన వర్ణ వ్యవస్థయేర్పడ జాలదు. పై చర్చను బట్టి, వర్ణవ్యవస్థకు మనుగడయే ఉన్నట్లు కన్పడుట లేదు.

ఏ దేశములోనైననూ వర్ణవ్యవస్థ లేకున్నప్పటికి, దేశపరిపాలనా వ్యవస్థ ఉండక తప్పదు. కాబట్టి, పాలకధర్మములను గురించి విచారించెదము.


## గురుపూర్ణిమ

మన అచలానంద ఆశ్రమములో
తేది 31-7-2015 **గురుపూర్ణిమ**
సందర్భముగా
**శ్రీశ్రీశ్రీ 'యోగి'**
**అచలానందస్వామివారికి**
శిష్యులచే పాదాభిషేకము
మరియు పాద పూజ జరుగును.
కావున భక్తులందరూ విచ్చేసి
గురువుగారి కృపకు పాత్రులు
కాగలరు.

**గమనిక :** మంత్రోపదేశము
తీసుకొనేవారికి మంత్రోపదేశము
ఇవ్వబడును.

**శ్రీ అచలానంద ఆశ్రమము**
**మంగమూరు రోడ్డు, ఒంగోలు**
**ఫోన్స్: 08592/ 235341**
**9949132469**

# వేద పరిచయము

## యజుర్వేద పరిచయము

.......... ఆచార్య డా॥ మట్టి కృష్ణారెడ్డి ............

(ఏప్రిల్ సంచిక తరువాయి)

**అధ్యాయాల పరిశీలన :**

**1వ అధ్యాయం :** ఈ అధ్యాయంలో యజ్ఞానికి ఉపకరించే సాధనాల ప్రస్తావన, ప్రశంస ప్రధానాంశాలు. గోవులు, వాటి నుండి లభించే పాలు, నెయ్యి, అగ్ని, నీరు, ధాన్యం, దర్భలు మొదలగునవి పుష్కలంగా లభించాలని, ఉపయోగపడాలని ప్రార్థన కనబడుతున్నది. యజ్ఞం దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు ఉపయోగపడుతుంది. అందువల్ల యజ్ఞం 'నిర్విఘ్నంగా' సాగాలని యజ్ఞాన్ని ధ్వంసం చేసే రాక్షసుల్ని అగ్ని భస్మం చేయాలని స్తోత్రం భగత్పరంగా చేయబడింది. మానవ శారీరక వ్యవస్థకు నాభి కేంద్రీకృతమైన నాడీక్షేత్రము. అలాగే మానవుల సుఖమయ జీవనానికి యజ్ఞం ఆయువుపట్టు. యజ్ఞభావనలేని వారి జీవితం నిరర్థకం అని ఈ అధ్యాయం ప్రబోధిస్తున్నది.

**2వ అధ్యాయం :** ఈ అధ్యాయం యజ్ఞవేది స్వరూపాన్ని, వైశిష్ట్యాన్ని ప్రధానంగా తెలియజేస్తున్నది. యజ్ఞమూర్తి సేవకు సహకరించమని దేవగణాన్ని, పితృగణాన్ని ప్రార్థించడం కూడా ఇందులో ప్రత్యేకాంశం. భూమాతను అగ్నిలో ఆహుతులు వేయడానికి సహకరించాలని ప్రార్థన చేయబడింది. యజ్ఞపురుషుడిని యజ్ఞాన్ని ధ్వంసం చేయడానికి తిరుగుతున్న రాక్షసులను తరిమికొట్టాలని, యజమానికి బ్రహ్మతేజస్సునిచ్చి, అనుష్ఠానానికి తగిన శక్తియుక్తులనిచ్చి యాగం పరిపూర్ణం కావడానికి ఆనుకూల్యమును ప్రసాదించుమనే ప్రార్థనలకు ప్రధానంగా ఈ అధ్యాయం మూలభూతమైనది.

**3వ అధ్యాయం :** ఈ అధ్యాయంలో అన్ని వస్తువులను పవిత్రం చేసే అగ్నిని మరియు 'శత్రునాశకుడు, యాగరక్షకుడు' అయిన రుద్రుని ప్రార్థించే మంత్రాలున్నాయి. అగ్ని మానవులకు ఉపకరించే వస్తువులను శుద్ధం జేస్తున్నది. భూమిని, జలాన్ని పుష్టివంతం చేస్తున్నది. అదే అగ్ని ఝఠరాగ్నిగా తేజరిల్లుతూ శరీరంలోని దోషాలను పోగొట్టి తేజస్సు, పుష్టిని కలిగిస్తున్నది. సవిత త్రికాలాల్లో మానవులకు సంక్రమిస్తున్న దోషాలను పరిహరిస్తున్నది. మానవబుద్ధిని శ్రేష్ఠమైన పనులకు ప్రేరేపిస్తున్నది. రుద్రుడు త్రినేత్రంతో శత్రుసంహారం చేస్తున్నాడు. ఔషధప్రదాతయై అకాలమృత్యువు నుండి జీవులను సంరక్షిస్తున్నాడు. పక్వమైన (గుమ్మడి) పండు తొడిమ నుండి ఊడిపడేట్టు జీవులకు సంసారబంధాలు తొలగి మోక్షం లభించాలన్న అపూర్వ స్తోత్రం కూడా ఈ అధ్యాయంలో విరాజిల్లుతున్నది. మోక్షపురుషార్థానికై జీవుడు యాజ్ఞికమైన చింతనతో జీవించాలని ఈ అధ్యాయం వివరిస్తున్నది.

**4వ అధ్యాయం :** ఈ అధ్యాయం వైజ్ఞానికమైన ఆర్షభావాలకు ప్రతీక. హోమంలో వాడబడే ఆజ్యం స్వచ్ఛమైన నీటిని వర్షం ద్వారా సమకూరుస్తుంది. యజ్ఞధూమం ఆకాశంలోని వర్షపునీటిని శుభ్రపరుస్తుంది. ఆరోగ్య ధాతువులను ఆ నీటికి అందిస్తుంది. సూర్యుడు తేజస్సును కళ్లకు

ప్రసాదిస్తాడు. అందుకే యజ్ఞకర్తలకు నేత్రదాతగా సూర్యుడు ప్రసిద్ధి చెందాడు. యజ్ఞఫలాన్ని స్వీకరించడానికి వినమ్రంగా దేవతలను ఆహ్వానిస్తే స్వీకరించి అక్షయ ఫలాలను అనుగ్రహిస్తారు. భగవంతుడు వరుణరూపంలో ప్రధానంగా అడవులపైన ఆకాశాన్ని విస్తరింపజేస్తాడు. అందువల్ల వర్షాలు బాగా కురిసి వృక్షసంపద మెరుగవుతుంది. ఆ వృక్షాలు వర్షానికి కారణం అవుతాయని వివరించింది. అడవులు కొట్టివేస్తే అనావృష్టి కలుగుతుందని సూచించింది.

**5వ అధ్యాయం** : ఈ అధ్యాయం విశ్వమంతా వ్యాపించిన మహావిష్ణువు వైభవాన్ని ప్రధానంగా ఆవిష్కరిస్తున్నది. భూమిలో, అంతరిక్షంలో, ద్యులోకంలో తన పాదాలనుంచిన భగవానుడు సత్త్వరజస్తమోరూపంతో తన శక్తిని వ్యాపింపజేసాడని తెలియజేస్తుంది. ప్రధానంగా అగ్నిమథనాన్ని తెలియజేసిన అధ్యాయం, యజ్ఞంలో అరణికొయ్యలను మథించి అగ్నిని సృష్టించడం. అధరారణిని ఊర్వశి, ఉత్తరారణిని పురూరవ అని వ్యవహరిస్తారు. ప్రతి యజమానుడు యజ్ఞం చేసి పుత్రపౌత్రాదులతో సుఖంగా ఉండాలని, నేతితో లోకోపకారం చేయాలని ప్రబోధించింది.

**6వ అధ్యాయం** : యూపవృక్షం, యూపస్తంభం, చషాలం వంటి యజ్ఞోపకరణాలను గురించి వివరించింది. యూపస్తంభాన్ని చూసి పశువులు వాటి దగ్గరకు చేరతాయి. మన ఇంద్రియాలు, మనసు వాక్కు-శాంతి, నిర్దోషితను కలిగి ఉండాలంటే యజ్ఞాన్ని ఆశ్రయించాలి. యజ్ఞాన్ని ఆశ్రయించడానికి ఆధారమైనవి ఓషధలు, హవిస్సు కనుక వాటిని కాపాడమని యజమాని అర్థిస్తాడు. సోమలతను నలుగగొట్టి శుభ్రం చేయడం వల్ల యజమాని మనస్సు పవిత్రతను పొందుతుంది. యజ్ఞం మానవాభ్యుదయానికి, వాతావరణ పరిరక్షణకు కారణమవుతున్నదని నిరూపించినది.

**7వ అధ్యాయం** : సోమలతను, ఇంద్రశక్తిని, వివిధ దానవస్తువులను ప్రధానంగా ప్రస్తుతించిన అధ్యాయం ఇది. ఇందులో సోమలత స్థిరశక్తిని ప్రసాదించి, ఇంద్రియలంపటాన్ని దూరం చేసి, నేత్రజ్యోతిని వృద్ధిచేస్తూ, శత్రువులను శిక్షించాలని ప్రార్థించబడింది. ధనధాన్యాదులను అనుగ్రహింపుమని వృత్రహంతుని స్మరిస్తూ చైత్రాదిమాసతుష్టికోసం హోమాన్ని ఆచరించాలి. ముఖ్యంగా గోవులు, అశ్వాలు, సువర్ణం ఇవి ఫలాన్ని సంపూర్ణంగా అందించే దానవస్తువులుగా తెలియజేస్తున్నది.

**8వ అధ్యాయం** : యజ్ఞానికి చెందిన గర్భాన్ని, విశ్వకర్మ మహిమను ప్రధానంగా తెలియజేస్తున్నది. యజ్ఞధర్మం బంగారంలా శుద్ధమైనది, సముద్రతరంగంలా ఉవ్వెత్తున, వాయుకంపనలా వేగంగా పదవమాసంలో బయటకు వస్తుంది. విశ్వకర్మ ఇంద్రుని విశ్వరక్షణకు యోగ్యునిగాను, అవధ్యునిగాను చేశాడు. ఈ అధ్యాయంలో యజ్ఞఫలం వృద్ధినొంది అన్ని దిక్కులకు అభ్యుదయాన్ని చేకూర్చాలని కూడా ముఖ్యంగా ఆకాంక్షింపబడింది.

**9వ అధ్యాయం** : ఓషధుల యొక్క గొప్పదనాన్ని స్తుతించడం ప్రధానమైన అంశం. ఆయుర్వృద్ధి, ఇంద్రియాలకు పుష్టిని కలిగించే యజ్ఞానికి ఈ ఓషధులు మూలమైనవి. ప్రజాపతి నీరు, ఓషధుల మధ్య సోమరూపంలో తేజస్వంతమైన పదార్థాన్ని సృజించాడు. సవిత శాసనకార్యాన్ని, అగ్ని గృహస్థులను, సోముడు ఓషధులను, బృహస్పతి వాక్కును పరిరక్షించాలని ఈ అధ్యాయంలో

తరువాయి 15వ పేజిలో......

# అనుసరణీయం - ధర్మరాజు మార్గం

... గోనుగుంట మురళీకృష్ణ

**ఉ॥ ఆలును బిడ్డలేడ్వ నృపులాలములో కడతేర ఎల్ల చు**
**ట్టాలను రూపుమాయ కకటా! ఇల దక్కునె, దక్కనిత్తురే**
**చాలును రాజ్యభాగము ప్రజల్ సుఖియించిన నాకు చాలు**
**నే చాలక కాడు చువ్వె తినజాలను నెత్తురు కూడు మాధవా!**

ధృతరాష్ట్రుడు, పాండురాజు అన్నదమ్ములు. ధృతరాష్ట్రుడు అంధుడవటం వలన పాండురాజు అన్నగారిని సంహాసనం మీద కుర్చోబెట్టి సామ్రాజ్య రక్షణ భారం చేపట్టాడు. కొంతకాలానికి మునిశాపం కారణంగా పాండురాజు మరణించాడు. పాండురాజు కుమారులు పాండవులు. ధృతరాష్ట్రుడి కుమారులు కౌరవులు.

పాండవ కౌరవులందరిలో పెద్దవాడు ధర్మరాజు. ధర్మరాజే కౌరవ సామ్రాజ్యానికి కాబోయే ప్రభువు అని కురువృద్ధులందరి అభిప్రాయం. కానీ ధుర్యోదనుడు అందుకు అంగీకరించలేదు. "మా తండ్రి అంధుడు కావటం వల్ల పాండురాజు రాజ్యం చేశాడు. నేను అంధుడను కానుగా! కాబట్టి రాజ్యం మొత్తం మా తండ్రి సంతానంలో పెద్దవాడయిన నాదే!" అన్నాడు.

కురువృద్ధులందరూ ఆలోచించి రాజ్యాన్ని రెండు భాగాలు చేసి ధర్మరాజుకు, ధుర్యోధనుడికీ చెరొక భాగం ఇవ్వమని ధృతరాష్ట్రుడికి చెప్పారు. కానీ ధుర్యోధనుడికి అది ఇష్టంలేదు. ఎలాగైనా పాండవులకు రాజ్యభాగం దక్కకుండా చేద్దామని అనుకున్నాడు. పాండువులను తీర్థయాత్రల నెపంతో పంపించి లక్క ఇంటిలో విడిది కల్పించి ఆ ఇల్లు తగులబెట్టించాడు. పాండవులు ఎలాగో బ్రతికి బైటపడ్డారు. మాయాజూదంలో ధర్మరాజు రాజ్యభాగాన్ని కాజేసి కట్టుబట్టలతో అడవులకు పంపేశాడు. దుర్యోధనుడు ఇన్ని చేసినా పాండవులు ధర్మానికి కట్టుబడి అవన్నీ సహించారు. జ్యూద నియమం ప్రకారం పన్నెండేళ్ళు అరణ్యవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసం చేశారు.

అజ్ఞాతవాసం ముగిసిన తర్వాత పాండవులు తమ రాజ్యభాగం తమకి ఇవ్వమని అడగటానికి శ్రీకృష్ణుని కౌరవుల దగ్గరకు రాయబారిగా పంపించటానికి నిర్ణయించారు. "మీ సందేశం ఏమని చెప్పమంటారు ? " అని శ్రీకృష్ణుడు పాండవులందరి అభిప్రాయాలు అడగగా ధర్మరాజు తప్ప మిగిలిన నలుగురూ, ద్రౌపదీ "సంధి కోసమే ప్రయత్నించినా నీవు సమర నిర్ణయానికే ప్రోత్సహించు" అని చెప్పారు. ఆ సందర్భంలో ధర్మరాజు చెప్పిన పద్యం పైన పేర్కొన్నది.

"రణరంగంలో రాజులందరూ కడతేరిపోగా, వారి బంధువులందరూ మరణించగా వారి భార్యా బిడ్డలు భోరుమని విలపిస్తారు. ఇంత చేసినా రాజ్యం దక్కనిస్తారో ? లేదో ? మా అన్నదమ్ములు ఐదుగురికీ ఐదు ఊళ్లు ఇమ్మని చెప్పు.ప్రజలు సుఖంగా ఉంటే నాకంతే చాలు. యుద్ధమూ వద్దు, బంధునాశనమూ వద్దు. ఈ నెత్తురు కూడు నేను తినజాలను" అని ఈ పద్యం యొక్క భావం.

ఈ పద్యం నాకు చాలా ఇష్టమైనది. ఈ పద్యం "తిరుపతి వేంకట కవులు"గా ప్రసిద్ధిపొందిన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, దివాకర్ల తిరుపతిశాస్త్రి రాసిన "పాండవోద్యోగ విజయములు" లోనిది.

సంధికి ధుర్యోధనుడు అంగీకరించడు. కురుక్షేత్ర యుద్ధం జరిగి కౌరవులందరూ మరణిస్తారు. రాజ్యం ధర్మరాజుకే దక్కుతుంది. అదంతా తర్వాత కథ.

రాజులు యుద్ధం చేయాలనే నిర్ణయంవల్ల ఎందరో సైనికులు మరణిస్తారు. సైనికుల మధ్య వ్యక్తిగత ద్వేషం ఏముంది ? వారి ప్రభువు ఆదేశానుసారం ఎదుటివారిని చంపేస్తారు. రక్తపు టేరులు ప్రవహిస్తాయి. ప్రజా జీవనం అల్లకల్లోలమవుతుంది. యుద్ధం వలన రాజులకు విజయం లభించినా భర్తలను, తండ్రులను, కుమారులను పోగొట్టుకుని చాలా కుటుంబాలలో దుఃఖమే మిగులుతుంది. ఏ కాలంలోనైనా యుద్ధం వాంఛనీయం కాదు. ప్రభువు ప్రజాక్షేమం కోరుకోవాలి.

ఆనాడు రాజ్యం కోసం అన్నదమ్ములు యుద్ధం చేస్తే, ఈనాడు ఆస్తులకోసం అన్నదమ్ముల మధ్య కొట్లాటలు, తగాదాలు జరుగుతున్నాయి. ఆస్తులు పోయినా ఫర్వాలేదు. "ఆస్తులు పోయినా పర్వాలేదు. ప్రశాంత జీవనం గడపాలి" అని ధర్మరాజు బాటని అనుసరించేవారు ఇప్పటికీ నూటికో, కోటికో ఒకరున్నారు. కానీ వారు అసమర్థులుగా, చేతగానివారుగా పరిగణింపబడుతూ, డబ్బుగలవాడే గొప్పవాడుగా నేటి కాలంలో చలామణి అవుతున్నాడు. అందుకే ఆ డబ్బుకోసం అనేకనేక నేరాలు, ఘోరాలు జరుగుతున్నాయి.

మానవుడికి విలువనిచ్చేది చదువు, సంస్కార, సత్ప్రవర్తన కానీ డబ్బుకాదు అనే విషయం అందరూ గుర్తించాలి. వ్యామోహాల నుంచీ మనసును నిగ్రహించుకోవాలి. అన్యాయాలను అరికట్టటానికి తొలిమెట్టు వైరాగ్య భావన. తప్పులు చేయనివాడే ప్రశాంతంగా జీవించగలడు. ఏది ఏమైనా కొన్ని వేల సంవత్సరాల క్రితం ధర్మరాజు చెప్పిన మాటలు ఈనాటికి కూడా అందరికీ అనుసరణీయం. ●

---

13 వ పేజి తరువాయి ......

కోరబడింది. రాజుయొక్క సంయమనం, శాంతికాముకత, రాజ్యహితాన్ని చేకూరుస్తుందని తెలియజేస్తున్నది.

**10వ అధ్యాయం** : రాజు రాష్ట్రహితానికై యజ్ఞం చేయాలని తద్వారా కన్నతల్లి వంటి భూదేవి బిడ్డలను ఆదుకొంటుందని చెప్పి, భూమికి-ప్రజలకు మాతాపుత్ర సంబంధం ఉన్నదని తెలియజేస్తుంది.

**11వ అధ్యాయం** : పృథ్వీకాలు, అంతరిక్షం ఆత్మ, సముద్రం యోని అని పేర్కొంటూ అశ్వం యొక్క విరాట్ రూపాన్ని తెలియజేసింది. అశ్వం ఈ అధ్యాయంలో సర్వాంతర్యామియైన పరమాత్మ స్వరూపంగా తెలియజేయబడింది. ఇంద్రుడు సూర్యునికి అడ్డంగా ఉన్న మేఘాలను తొలగించి కాంతిని ప్రసాదించినట్లు, పరమాత్మ అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. అగ్నిరూపంలో ఉన్న పరమాత్మ అన్ని వస్తువులను కాల్చివేసినట్లు అంతరాత్మగా ఉన్న పరమాత్మ జీవుల కష్టాలను సమూలంగా తొలగించి సంరక్షిస్తాడు. జలాలను ప్రసాదించి పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఇచ్చి పోషించినట్లు, దేవుడు జీవకోటిని రక్షిస్తున్నాడని ఈ అధ్యాయం తెలియజేస్తున్నది. (సశేషం)

> మనిషి ఎంత ఎత్తులో వున్నా క్రిందకుపడే ప్రమాదం ఎప్పుడూ పొంచే వుంటుంది. అలాగే అతను ఎంత నీచస్థితిలో వున్నా పైకి ప్రాకే అవకాశమూ అతని వెన్నంటే వుంటుంది.

# ఆది గురువు ఆచార్య శంకరులు

- శ్రీమతి జానమద్ది స్వర్ణలతా జోషి

(గత సంచిక తరువాయి)

**కాశీక్షేత్రానికి వెళ్ళమని గురువుగారి సూచన - భాష్యాదుల రచన :**

గురువాజ్ఞ మేరకు శంకరులు నేరుగా కాశీనగరానికి వెళ్ళిన వృత్తాంతము 'వ్యాసాచలీయం', 'చిద్విలాసీయం' అన్న గ్రంథాలలో లేదు. కానీ మాధవీయము, శంకర దిగ్విజయసారము, శంకర మందార సౌరభము అన్న మూడు గ్రంథాలలోను శంకరులు కాశీక్షేత్రానికి వెళ్లారన్న ఉదంతం వుంది.

కాశీక్షేత్రం సుప్రసిద్ధ పురాతన విద్యాస్థానం వరుణ, అసి అనే రెండు నదుల సమాగమం వలన ఆ క్షేత్రానికి 'వారణాసి' అన్నపేరు వచ్చింది. కాశీలో మరణించిన వారికి సాక్షాత్తు శివుడే తారకోపదేశం చేస్తాడని, అది చాలా పవిత్రమైన ప్రదేశమని పురాణ ప్రవచనం. ప్రళయకాలంలో రుద్రుడు తన త్రిశూలంపైన ఈ నగరాన్ని నిలిపి కాపాడాడని స్థల పురాణం. దక్షిణ భారత ప్రజలు అక్కడి నదులను పవిత్రమైన గంగానదితో పోల్చడము, పవిత్ర స్థలాలను 'దక్షిణకాశి' అని ప్రస్తుతించడమూ ఈ క్షేత్ర మహాత్మ్యాన్ని చాటు చెబుతున్నాయి. ఇలా ఎన్నో కారణాల చేత ప్రసిద్ధిపొందిన ఈ క్షేత్రము కాశీరాజుకు రాజధానియై ఎందరో విద్వాంసులకు ఆశ్రయమిచ్చింది. గౌతమ బుద్ధుడు తన ధర్మోపదేశాన్ని ప్రారంభించినది ఇక్కడే. ఇక్కడే సారనాధ్ (సారంగనాథ్) అన్న ప్రసిద్ధ ప్రదేశముంది. బౌద్ధులకు, బ్రాహ్మణులకు వాగ్యుద్ధము జరిగిన తరువాత బ్రాహ్మణులు తాము వుండే దక్షిణ భాగాన్నే కాశీక్షేత్రమని పిలిచేవారు ఉత్తరకాశీలో చనిపోయిన వారు మరల గాడిదై పుడతారన్నది బౌద్ధేతరుల సంకుచిత విచారం. అయినప్పటికీ కాశీక్షేత్రం విద్వాంసుల క్షేత్రమనియు, అక్కడికి వెళ్ళి భాష్యరచన చేసి తమ అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేయమని గోవింద భగవత్పాదులు శిష్యులని ఆదేశించినట్లు తెలుస్తుంది. కాని ఆచార్యులు మొదలు బదరిలో భాష్యాన్ని రచించి, తమ విద్వత్తును ప్రకటించడానికి కాశీకి వెళ్ళారని చిద్విలాసీయంలో చెప్పబడింది.

**పద్మపాదుడనే శిష్యుని స్వీకరించుట :**

శంకరులు కాశీలో వున్న సమయంలోనే ఒక బ్రాహ్మణ వటువు ఆయనకు నమస్కరించాడు. శంకరులు ఆ వటువు వృత్తాంతము అడుగగా 'స్వామి' నేను చోళదేశపు వాడను. అక్కడ హరిభక్తులను ప్రోత్సహించే కావేరీనది ప్రవహిస్తూ వుంది. అక్కడి నుండి దేశాటనం చేస్తూ సంసార బంధాలు తొలగించుకోవాలని మీ శరణుజొచ్చాను.' అని చెప్పాడు. ఆచార్యులు కృపాదృష్టితో ఆ వటువుకు విధిపూర్వకంగా సన్యాసదీక్షనిచ్చారు. అతడే 'సనందుడు' అనే మొదటి శిష్యుడు. అలా ఎందరో ఆచార్యుల శిష్యులయ్యారు. సనందుడి పట్ల మిగిలిన శిష్యులలోని అసూయను పోగొట్టడానికి నదికి ఆ వలవున్న సనందుని పిలిచారు. 'గురువాక్యం తక్షణ కర్తవ్యం' అనే భావించే సనందనుడు నదిలో నుండి నడవటం ప్రారంభించాడు. అతని గురుభక్తికి

పులకించిన నదీమ తల్లి అడుగడుగునా పద్మాలను ప్రసాదించింది. పద్మాలపై నడచి రావటంతో అతడు, ఆ సనందనుడే పద్మపాదుదయ్యాడు. ధర్మమార్గంలో నడిచే వాడికి దైవసహాయం లభిస్తుందంటే ఇదే.

కాని చిద్విలాన గ్రంథంలో ఆ వటువు అహోబిలక్షేత్రంలోని లక్ష్మీ, మాధవాచార్యులకు నరసింహుని వరప్రసాదం చేత జన్మించాడని, పేరు విష్ణుశర్మ అని. తల్లిదండ్రులు మరణానంతరం, స్వప్నంలో కనిపించి ఆదేశించిన నరసింహస్వామి ఆజ్ఞమేరకు ఆచార్యుల చెంత చేరాడని చెప్పబడింది.

**అంత్యజుని వేషంలో విశ్వేశ్వర దర్శనం :**

ఆచార్యశంకరులు ప్రయాగ, గయ ప్రదేశాల మార్గంలో కాశీచేరారని, అక్కడ,

**శ్లో॥ స్నాత్వైవ తోయే మణికర్ణికాయా విశ్వేశ్వరం ప్రత్యహమర్చతి స్మ। వాసం చకార నిశమేష శిష్యైః సాకం స ఘట్టే మణికర్ణికాయాః॥**

(చిద్విలాసీయం 12- 2,3)

అని చెప్పడంలో ఆచార్యులు మణికర్ణికా ఘట్టంలో శిష్యులతో బాటు నివాసముండి, నదీ స్నానం చేసి ప్రతిదినమూ విశ్వేశ్వరుని అర్చించేవారని తెలుస్తూవుంది. ఆచార్యుల దర్శనానికి కూడా ఎంతోమంది వచ్చేవారు. ఇలా వుండగా శంకరులు ఒకనాడు ఆయనశిష్యసమేతంగా స్నానానుష్ఠానానికి నదికి వెళ్ళుచుండగా నాలుగు కుక్కలను వెంటబెట్టుకొని ఒక అంత్యజుడు ఎదురయ్యాడు. అతనిని చూచిన ఆచార్యులు 'దూరం జరుగు' అన్నారు. ఈ ఒక్కమాటతో ఆయనలో జ్ఞానం ఇంకా పరిపక్వం కాలేదని తెలుస్తుంది ఆచార్యులన్న మాటలకు ఆ అంత్యజుడు 'అద్వితీయమైన శుద్ధ సంగ సత్య చిత్సుఖ రూపమైన అఖండ వస్తువు ఒక్కటే' అని వేదాంతులు చెబుతూ వుంటే నీలో ఇంకా ఈ భేదభావమెందుకు ? అదేమి ఆశ్చర్యం ? దండ కమండలాలు, కాషాయ వస్త్రాలు ధరించి, జ్ఞానాన్ని గురించి గంభీరంగా ఉపన్యసిస్తూ అమాయకులైన గృహస్థులను వంచిస్తున్నావా ? దూరం జరగమన్నది ఎవరిని ? దేహాన్నా ? ఒక అన్నమయం కోశం నుండి ఇంకో అన్నమయ కోశం ఎలా జరుగుతుంది ? అలా చూస్తే మనిద్దరం సమానమే. ప్రత్యగాత్మకు బ్రాహ్మణుడు, శ్వపచుడు అన్న తేడా లేదు కదా! సూర్యుడి ప్రతిబింబం గంగా నదిలోను, కల్లుముంతలోనూ ఒక్కటిగానే వుంటుంది కదా! మునివర్యా! అన్నీ శరీరాలలోనూ తానే వున్న పురాణపురుషుడిని మరచి నేను శుద్ధబ్రాహ్మణుడను. నీవు శ్వపచుడవు దూరం జరుగు అనడం వితండ వాదం కాదా? ' అంటూ ఆత్మ తత్వాన్ని బోధించాడు. అప్పుడు శంకరులు ''ఇప్పుడు నాలో నీవు అంత్యజుడవు అన్న భావంలేదు. సమస్తమూ ఆత్మనే అన్న భావం ఎవరిలో వుంటుందో అతడు ద్విజుడైనా శ్వపచుడైనా వందనీయుడే నన్నది నా దృఢ నిర్ణయం. అతడే నాకు గురువు'' అన్న అర్థం ధ్వనించేలా శ్లోకాలు చెప్పారు. అంతలో అంత్యజుడు మాయమై సాక్షాత్తు చంద్రమౌళియే ప్రత్యక్షమయ్యాడు. ఈ ఘటనను గూర్చిభిన్నాభిప్రాయాలున్నాయి. చిద్విలాసంలో ఈ సంఘటన లేదని చెప్పబడుతున్నది. ఆత్మబోధులు తమ 'సుషుమ్నా గ్రంథం'లో 'జాహ్నవీతి రమాసాద్యబోధితో అంత్యజరూపిణా। విశ్వేశ్వరేణ భాష్యం స బ్రహ్మసూత్రస్య నిర్మమే' అని వర్ణించారు.

ఈ సంఘటనను గురించి 'చిద్విలాసీయం'లో ఇలా చెప్పబడింది. ఆచార్యులు స్నానం చేసి విశ్వేశ్వరుని అర్చించి 'మహేశ్వరా! అద్వైతం సత్యమో,

తరువాయి 20 వ పేజిలో......

# యోగవాసిష్ఠ కథాలహరి

డా॥ ధారారామనాధశాస్త్రి, ఒంగోలు

## బలిచక్రవర్తి మోక్షసాధన

రామచంద్రుని ఆవరించినది నిరాశా పూర్వకమైన వైక్లబ్యము. దానిని జిజ్ఞాసాపూర్వకమైన వైరాగ్యముగా మార్చి ఆ వైరాగ్యంలో నుండే కర్తవ్యపూర్వకమైన నిస్సంగమైన కర్మానుష్ఠానం నేర్పడమే బ్రహ్మజ్ఞానియైన శ్రీవశిష్ఠుల ప్రయత్నం. అందుకే కథా ప్రవచనం ఆ మార్గంలో ఒక్కొక్కమెట్టు గురువసిష్ఠులూ, శిష్యరాములూ అధిరోహిస్తున్నారు. ఆ వేళ గురుదేవులు ఇలా అన్నారు. 'రామప్రభో! బలిచక్రవర్తి గురించి విన్నావుకదయ్యా'.

'విన్నాను గురుదేవా, మహావీరుడు, దాత, భోగి, అసురలోకంలో అగ్రశ్రేణి కథానాయకుడు'.

అంతేకాదు. మహాయోగి, మోక్షోన్ముఖుడైన సాధకుడు. అతని చరిత్ర వివరంగా చెబుతాను. అవధరించు' అంటూ ఇలా చెబుతున్నారు.

అది సుతల సామ్రాజ్యం. ఆనాడు మహాసౌధము ఉపరితలాన రత్నవేదిక మీద ఉపవిష్టుడైయున్న బలిచక్రవర్తి మనస్సు ఆకులమైనది ఆలోచనలు శరత్కాలపు మబ్బులాగా, ఏటినీటి తరగల్లాగా, పిల్లగాలుల సవ్వడిలాగా కమ్ముకుంటున్నవి.. స్మృతిపథంలో గత జీవిత దృశ్యమాలిక ఒకదాని వెంట మరొకటి స్పష్టంగా ఆకారం తాల్చి కళ్లముందు మళ్లీ కదులుతున్నట్లు అనిపించింది. క్షీరసాగరమథనం - అందు దేవదానవుల పూనిక - సదసద్వస్తు సంభూతి - అమృతం ఆశించి విఫలురైన దైత్యులు - దేవాసుర సంగ్రామం - తన ఓటమి - విష్ణుమాయ - శుక్రాచార్య సన్నిధి - విశ్వజిద్యాగము - చతుర్దశభువనాలకి తానే పరిపాలకుడై ధర్మోత్తరంగా దానశీలుడై పరిపాలించడమూ - యజ్ఞవాటిక - వామనుని రాక - మూడడుగుల దానము - శుక్రాచార్య శాపము - సుతలాధిపత్యము - ఇలా ప్రవర్తించిన దృశ్యమాలిక శమించిన పిదప బలిచక్రవర్తి ఆలోచనలో పడ్డాడు. తలపుల్లో తలమునకలైనాడు. ఇంతకీ ఏమి జరిగినట్టు? గెలుపోటములు, ఒకనాడు చతుర్దశ భువనాధిపత్యము - ఇప్పుడు సుతలాధిపత్యము. పొందని భోగములేదు. అందని ఆనందము లేదు. ఇన్నేళ్ల యీ భోగానుభవానికి ముగింపు ఎక్కడ. ఈ నా మనోభూమికలకు విశ్రాంతి ఎక్కడ. అనంతమైన యీ భోగానుభవ ప్రస్థానంలో నా ఆత్మకి మజిలీ ఎక్కడ ? ఎక్కడ ? ఎక్కడ ?

ఇలా ఒక ఉద్వేగానికి, వేదనకి గురియై తల్లడిల్లుతున్న తనయుని స్థితి గమనించాడో అన్నట్లుగా సరిగా అదే సమయానికి బలిచక్రవర్తి పితృదేవులు విరోచనుడు వచ్చాడు. అభివాదం చేసిన కుమారుని 'చిరంజీవ, జ్ఞానవాన్ భవ' అని ఆశీర్వదించి అతని వల్ల సమస్తమూ తెలుసుకున్నవాడై యిలా చెప్పాడు.

'నాయనా! బలీంద్రా! జీవితంలో ఇలాంటి జిజ్ఞాసా పూర్వకమైన ఘట్టం ఒకటి ప్రతి జీవికి ప్రాప్తిస్తుంది. నీకున్నూ అంతే, నాకు తెలిసినంతలో అపారమైన భోగానుభవం ఫలితంగా ఒకదశలో విరక్తి పుట్టి విచారణకు దారి తీస్తుంది. విచారణ ఫలితంగా భోగవిరక్తి పుడుతుంది. ఈ రెండూ సముద్రము మేఘాల లాగా ఒకదానికి మరొకటి పూరకాలుగా

పనిచేస్తుంటాయి. ఈదశలో ఆత్మావలోకనము, తృష్ణా పరిత్యాగము అన్న రెండు కర్తవ్యాలనీ ఒకసారి అమలు పరచాలి. అదొక గొప్ప సాధన. ఆలోచించు మళ్లీ కలుద్దాం - ఇలా చెప్పి తండ్రిగారు వెళ్లిపోయారు.

బలీంద్రుడు మరింత ఆలోచనలో పడ్డాడు. మహావైభవాలను పొందాను. సమస్త రాజ్యాలను ఆక్రమించాను. ఎన్నిసార్లు చూచినా అవే వస్తువులు అవే భోగాలు. నాన్నగారు చెప్పినట్లు ఆత్మబోధ అలవరచుకొని పరిపూర్ణత్వాన్ని పొందుతాను, అని భావించి సాధన ప్రారంభించాడు. కొంత కాలం గడిచింది. కానీ ఏ విషయమూ అనుభూతమైనట్టుగాని ఒక ఉదాత్తస్థితి లభించినట్టుగాని అనిపించలేదు. అంతా అకున అందక పోకన పొందక ఉన్నట్టున్నది.

నాటి ప్రాతఃకాలం బలీంద్రుడు నిశ్చల ధ్యానమగ్నుడై తన గురువులైన శుక్రాచార్యులను ఆహ్వానం చేశాడు. అనంత సర్వవ్యాపక చిదాత్మ సర్వరూపులైన భగవంతులు శ్రీశుక్రులు బలిచక్రవర్తికి సన్నిధి ప్రసాదించి అర్ఘ్యపాద్యాద్యుపచార సంపూజితులై యుండగా బలీంద్రుడు ఇలా నివేదించుకుంటున్నాడు.

ఆచార్యా! మహానవ్యోమహదాయంకాలైన సమస్తభోగాల పట్ల నేను విరక్తుడనైనాను. అజ్ఞానాన్ని నశింపజేసే తత్త్వాన్ని ఉపదేశించి మీ శిష్యునికి నిర్వాణపథం నిర్దేశించండి. అనగా విని శుక్రాచార్యులు ఆనంద పులకిత హృదంతరంగులై 'శిష్యసత్తమా నీ చరిత్ర లోకోత్తరమైనది. మహావీరునిగా మహాదాతగా, మహాత్యాగిగా, సుతల దేవేంద్రునిగా నీది అజరామరమైన కీర్తిపీఠం. ఇవ్వాళ జిజ్ఞాసువువై మరింత నాకు ప్రీతి పాత్రుడవయ్యావు. నీ వంటి మహామనీషికి ముక్తిమార్గం సుగమం. అవధరించు.

చిదిహాస్తి హి చిన్మాత్ర మిదం చిన్మయమేవచ
చిత్త్వం చిదిహమేతేచ లోకాశ్చిదితి సంగ్రహః

ప్రపంచమున ఉన్నది ఒక్క చైతన్యం (ఆత్మ) మాత్రమే. నీవు, నేను, ఈ సమస్తలోకము చిద్రూపమే. అంటే చైతన్యమయమే. ఇది సమస్త బోధనల సారాంశం.

చిచ్చేత్య కలనా బంధస్తన్ముక్తి ర్ముక్తిరుచ్యతే
చిదచేత్యా ఖిలాత్మేతి సర్వసిద్ధాంత సంగ్రహః

చైతన్యము యొక్క విషయాకారమైన దృశ్యకల్పన బంధము అలాంటి కల్పన అంటే బంధము లేకపోవడమే మోక్షము. విషయాకారానికి అతీతమైన చైతన్యమే పూర్ణాత్మ. ఇది సమస్త సిద్ధాంత సంగ్రహం. ఇలా సెలవిచ్చి ఆచారస్వామి అదృశ్యులయ్యారు.

బలీంద్రుడు క్రమంగా సాధన పథంలో ఒక్కొక్కమెట్టు ఎక్కి జ్ఞాన భూమికకు క్రమంగా చేరువవుతున్న స్థితిలో ఒకనాటి ప్రాతఃకాలం హఠాత్తుగా బలిచక్రవర్తికి ఏదో స్ఫురణకు వచ్చి గవాక్షంగుండా బయటకు చూచాడు. ఆశ్చర్యం ద్వారం దగ్గర శంఖచక్రగదాశార్ఙ్గ పాణి, సహస్రాదిత్య తేజోవిరాజితుడు, పీతాంబరధారి, జ్ఞానరోచిః పటలమూర్తి శ్రీ మహావిష్ణువు అధివసించి యున్నారు. అదీ చేతులు కట్టుకొని ద్వారపాలకునిలాగ. భీతభీతుడు ప్రసన్నుడు అయిన బలి శరవేగంతో స్వామి దగ్గరకు వెళ్ళి చరణపీఠి మోకరిల్లి, 'స్వామీ సర్వాపరాధక్షమ, నేను మీ ఉనికిని ఇన్నేళ్లు గుర్తించలేదు.' అనగా స్వామి చిరునవ్వుతో కరుణాపూర్ణ నేత్రద్వయం మెరుస్తుండగా ఇలా అనుగ్రహ వచస్సు ప్రసరించారు.

'బలీంద్రా! సాధు! సాధు! నీ కథ లోకోత్తరం. నీకు జ్ఞాపకమున్నదా నీ సమస్తాన్నీ హరించేటప్పుడు నేను చెప్పినది ? నేను ఎవరికి మోక్షపదం ఇవ్వదలిచానో వారి సమస్త సంపదలను హరించి వేస్తాను. ఇంకో మాటకూడా మీ దంపతులతో చెప్పాను.

మీ దగ్గర చేయిసాచి దానం స్వీకరించి నందుకు

మీ యింటి కాపలావానిగా పనిచేస్తాను అని. మరి ఆ రెండు వాగ్దానాలు నెరవేర్చుకున్నాను కదా!' అంటూ బలీంద్రుని కళ్లల్లోకి స్వామి సూటిగా చూచారు.

ఆ మరుక్షణం బలీంద్రుని అంతరంగం ఆనందార్ణవమైనది. జ్ఞానస్వరూపమైన కైవల్యం కరతలామలకం కానున్నది. పునఃపునరాలింగిత భూతలుడై బలి అంటున్నాడు. 'అవును స్వామీ. మీరన్నది నిజం. మోక్ష సామ్రాజ్యం ముందు రాజ్యాలూ గీజ్యాలూ చిల్లిగవ్వకు కొరగావు. అదీకాక మీరు కాపలాదారునిగా ఉన్నది నా యింటికి కాదు. నా కంటికి, నాగుండెకు, నాబ్రతుకుకు, నాసర్వస్వానికి. ఆ మాటకి అర్థం అప్పుడు తెలీలేదు. ఇప్పుడు తెలిసింది మోక్షానందం దాన జపహోమ కర్మానుష్ఠానాల వల్లగాని, తీవ్ర తపశ్చర్య వలన మాత్రమే గాని లభించదు. అది మీ అనుగ్రహైక లభ్యం ధన్యోస్మి'. ●

---

17వ పేజి తరువాయి ......

ద్వైతం సత్యమో? శ్రుతిసారం తెలిసిన నీవే ఈ పండితుల ముందు సత్యాన్ని వెల్లడించు' అని ప్రార్థించాడట. అందుకు లింగం నుండి పార్వతీ పరమేశ్వరులిద్దరూ ప్రత్యక్షమై' అద్వైతమే శుద్ధ సత్యం. ద్వైతం కాదు' అని మూడుసార్లు గట్టిగా పలికి అంతర్ధానమయ్యారట. అలాగే అనంతానందగిరి, డిండిమకారుడు మొ॥ వారుకూడా తమ తమ వివరణలను ఇచ్చారు.

బౌద్ధమతం ప్రబలంగా వున్న ఆకాలంలో ఆ బ్రాహ్మణులు కూడా విద్యావంతులవుతున్నారని, శంకరులు చండాలుని గురువంటే అద్వైతం, బ్రాహ్మణ్యం క్షీణిస్తుందేమో నన్న భ్రమచేత ఆ చండాలుడు శివుడే నన్న భావాన్ని కల్పించారన్నది కూడా ఒక ఊహ. ఆశుకవిత ప్రచురంగావున్న మన దేశంలో చండాలునికే, శంకరులకూ ఛందోబద్ధంగా సంభాషణ జరిగిందన్నదీ కూడా ఒక తర్కమే. ఏది ఏమైనా శంకరాచార్య విరచితమనే 'మనీషా పంచకం' ప్రసిద్ధి చెందింది. ఈ ప్రకరణం ప్రారంభంలో 'సత్యాచార్యస్య గమనే కదా చిన్ముక్తిదాయకం కాశీక్షేత్రం ప్రతి సహగౌర్యా మారేగితు శంకరామ్॥ 1॥ అన్త్య వేషధరం దృష్ట్వా గచ్ఛ గచ్ఛేతి చాబ్రవీత్। శంకరః సోపి చండాలస్తం పునః ప్రాహ శంకరామ్॥2॥ అన్న రెండు శ్లోకాలు పార్వతి సమేతుడైన శంకరుని గూర్చి చెబుతున్నాయి. ఈ 'మనీషా పంచకం' ప్రాచీన శంకర విజయంలోనిదా ? లేక కుంభకోణ మఠంలో వుందని చెప్పబడుతున్న 'బృహచ్ఛంకర విజయం' అన్న గ్రంథంలోనిదా ? ఇదిలా వుండగా బ్రాహ్మణేతరుల విద్యాభ్యాసం ఇతిహాస, పురాణకాలం నుండీ వుందనడానికి విదురుడు, ధర్మవ్యాధుడే ఆధారం. లేఖన జ్ఞానం లేకపోయినప్పటికి తత్వ విచారంలో ముందుకు సాగి పరమార్థాన్ని అనుభవించిన స్త్రీలు, శూద్రులుగా కూడా వున్నారు. అలాంటివారు ఇప్పటికీ వున్నారు. అలాంటప్పుడు 'కాశీ' లాంటి మహత్తరమైన విద్యా క్షేత్రంలోని అంత్యజుడు వేదాంతం మాట్లాడటంలో ఆశ్చర్యమేముంది ? ఈ సంఘటనను నమ్మడంలో కూడా ఆశ్చర్యంలేదు. (సశేషం)

> **'మంచిమాట' అనేది చెప్పేవాడి దృష్టిలో మృదువుగా, వినేవాడికి కటువుగా, ఆచరించేవాడికి కఠినంగా, దాని ఫలాలను అనుభవించే వాడికి మధురంగా ఉంటుంది.**

గీతా సుధ

# భగవద్గీతకు భాసుర భాష్యం



డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

(గత సంచిక తరువాయి)

"నదులు తమ అస్తిత్వాన్ని కోల్పోవడానికా అన్నట్లు సముద్రంలో కలసిపోతున్నట్లు, మిడతలు వినాశనాన్ని కోరుకొంటున్నాయేమో అన్నట్లు అగ్నిలోకి దూకినట్లు, భీష్మ ద్రోణకృపాలంబస కర్ణాది వీరాధి వీరులు వారి వారి సేనలు నశించిపోతున్నట్లు కనిపిస్తున్నది. ఇంత భయంకర రూపంతో గోచరిస్తున్న నీవెవరు ?" అని అర్భకునిలా అడుగుతున్న అర్జునుణ్ణి చూచి శ్రీకృష్ణుడు ఇలా చెబుతున్నాడు "నిజానికి నేనూ నీలాంటి మానవుణ్ణే నేనూ మరణిస్తాను. కానీ నేను మరణించే లోగా అధర్మాలను, అక్రమాలను వాటికి కొమ్ముకాస్తున్న వ్యక్తులను నిర్మూలిస్తాను. మనిషిగా ప్రతి వాడూ చేయవలసినది అదే. ఒక్క నిన్ను (ధర్మాన్ని) తప్ప అందరినీ చంపేస్తాను. నేనే కాలాన్ని. కాలాగ్నిలో అందరూ భష్మం కావలసిందే. భష్మంకాకుండా నిలబడేది ఒకటే. అది వ్యక్తి చేసిన పని (కర్మ). వ్యక్తి వ్యక్తీకరించే జ్ఞానం. శ్లోకబద్ధం చేయబడీ తరతరాలకూ మౌఖికంగా అందజేయబడుతున్న జ్ఞానం (వేదం) శాశ్వతంగా ఉంటుంది ఈ మౌఖికంగా జ్ఞానాన్ని తరతరాలకూ అందజేయడం కూడా ఒక పనే కనుక "పని" మాత్రమే - అంటే వ్యక్తి చేసిన 'కర్మ' మాత్రమే - శాశ్వతం. అగ్నిలో భష్మం కానిది పైగా అగ్ని ప్రవేశం చేసి మరింత వెలిగేది ఒక్కటే అదే "బంగారం".

అగ్నిలో భస్మంకానిది = బంగారం

అగ్నిలో భస్మంకానిది = పని

గణిత శాస్త్ర సమన్యాయాన్ని సమన్వయంచేస్తే 'పనే బంగారం అని చెప్పవచ్చు. కాబట్టి నీవు కర్మబద్ధుడివి కావాలి. కాలాగ్నిలో రెండు పక్షాలు నాశనమై పోవాల్సిందే.

**కాలోఽస్మిన్ లోకక్షయకృత్ ప్రవృద్ధో లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః**
**ఋతేఽపి త్వాం న భవిష్యంతి సర్వే యేఽవస్థితాః ప్రత్యానీకేషు యోధాః**

(11-32)

ప్రపంచం కూడా అంతే. ఎంత వరకు భూమి (ప్రకృతి) భారం మోస్తుందో అంతవరకూ మోస్తుంది. ఆ తర్వాత మోయలేదు. ఇదే మాటను రాబర్ట్ మాల్థస్ అనే పాశ్చాత్య అర్థశాస్త్రవేత్త క్రీ.శ. 1600 సంవత్సరంలో చెప్పాడు. జనాభా గుణక శ్రేఢిలో పెరుగుతుందని, సదుపాయాలు అంక శ్రేఢిలో పెరుగుతాయని చెప్పాడు. (గుణక శ్రేడి అంటే 2,4,8,16,32,.... క్రమం) (అంకశ్రేఢి అంటే 1, 2, 3, 4,5, 6, 7, 8.... క్రమం) అంటే సదుపాయాల కన్నా జనాభా ఎక్కువౌతుందన్న మాట. ఈ ప్రజా సమూహ విస్ఫోటనాన్ని అరికట్టకపోతే ప్రకృతి స్వయంగా ప్రజావిధ్వంసం (Positive Checks) చేపడుతుంది. అదే భూకంపాలు, జలప్రళయాలు, ఐలాలు, లైలాలు, హుద్ హుద్‌లూ... వగైరాలుగా, అంటు వ్యాధులుగా, ఎయిడ్స్‌గా, స్వైను ఫ్లూలుగా, బర్డుఫ్లూలుగా రకరకాల రూపాలలో ప్రకృతి తన భారాన్ని తగ్గించుకుంటుందన్నమాట. క్రీ.శ. 1600 సంవత్సరంలో

మాల్థన్ మహాశయుడు చెప్పింది కూడా గీతాసారమేనన్నమాట. ప్రకృతి భీభత్సంలో, ప్రకృతి ప్రళయంలో మంచీ లేదు, చెడూ లేదు అంతా సమానమే. ఒక్కొక్కసారి మంచి కూడా కొట్టుకొనిపోతుంది. ఈ భూమి మీదకు ఒక 60, 70 లేదా 100 సంవత్సరాలు "అతిథి"గా వచ్చిన మనిషి ఆతిధ్యం అందించిన ఇంట్లో తన గౌరవాన్ని నిలుపుకుంటూ గృహస్తులకు చాలా తక్కువ అసౌకర్యంతో జాగ్రత్తగా జీవించి వెళ్లిపోవాలి. కాని ఇదేమిటి! "ఇంట్లో" కి వచ్చిన నాలుగైదు సంవత్సరాలకే "ఈ ఇల్లంతా నాకే కావాలి" అనుకుంటాడు. తన తోటి సోదరీసోదరులను చంపి అయినా సరే, బాధించి అయినాసరే, ఏడ్పించి అయినాసరే చివరకు తనకు ఆతిధ్యం ఇచ్చిన యాజమాని (ప్రకృతి)ని సంహరించి అయినానరే "ఈ ఇల్లంతా నాకే కావాలి" అనుకుంటాడు. నాదిర్షా, గజనీ, ఘోరీ, చంగిజ్‌ఖాన్, తామర్లేను, ముస్సోలినీ, హిట్లర్.... నుండి దాదాపు 99 శాతం ఇలా ఆలోచిస్తుంటే ఇంటి యజమానికి (ప్రకృతికి) ఓపిక నశించి తగిన విధంగా "అతిధి"కి దండన విధించడం జరుగుతుంది.... అందుకే అందరినీ నిర్మూలిస్తానన్నాడు గీతాచార్యుడు. (అందుకే గీతను వల్లె వేసే వారందరికీ ఈ భాష్యకారుడు ఒక విజ్ఞప్తి చేస్తున్నాడు. "భగవద్గీతను ఊరికే కంఠస్తం చేసి (బట్టీపట్టి) అప్పుజెప్పడం కాకుండా దానిలోని గూఢ నిగూఢ అర్థాలను తెలుసుకొని, నోటితో గీతను అప్పజెప్పడం కాకుండా గీతకు మీ మనసును అప్పగించండి. ఎలాగూ చనిపోవడం తప్పదు. అందరూ పోయేవారే... రాముడు, కృష్ణుడు, బుద్ధుడూ, ఏసూ, సోక్రటీసు, గాంధీ.. ఇలా అందరూ భౌతికంగా చనిపోయేవారే. అయినా జీవిత కాలంలో వారు వారు చేసిన పని (కర్మ) వల్లనే వారు శాశ్వతులైనారు. కాబట్టి గీతోపాసకులు కూడా ఏదైనా ఒక అజరామరమైన 'పని' చేయాలని సంకల్పించుకొని, ఆ దిశలో అడుగులు వేయాలన్నదే ఈ రాధశ్రీ (ఈ భాష్యకారుని) విజ్ఞప్తి.

తస్మాత్ త్వముత్తిష్ఠ యశో లభస్వ జిత్వాశత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్।
మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ (11-33)

కాలగర్భంలో అందరూ కలసిపోయేవారే. అందరూ నశించేవారే. కాబట్టి నీ ధర్మాన్ని నీవు నిర్వర్తించు. ఇప్పటి దాకా నీకు చూపించిన రంగుల హంగుల భావచిత్రం Kalaido scopic illusion అర్థంచేసుకో. ఎలాగూ కాలగర్భంలో కలిసిపోయే వారికోసం విచారించక నీ పని నీవు చేయి. భీష్మద్రోణ జయద్రధ కర్ణాదులు చావడం ఖాయం. నీవు శత్రువులను తప్పక జయిస్తావు.

ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ కర్ణం తథాన్యానపి యోధవీరాన్।
మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్॥ (11-34)

'ద్రోణ భీష్మజయద్రధ కర్ణాదులు ఎప్పుడో చచ్చిపోయారు" అన్నాడు కృష్ణుడు. నిజమే మరి. తన మనస్సుకు వ్యతిరేకంగా తానే పని చేస్తున్న ప్రతివాడూ చచ్చినవాడికిందే లెక్క. పాండవుల వైపే ధర్మం ఉన్నదని ద్రోణుడికీ తెలుసు, భీష్ముడికీ తెలుసు, కర్ణుడికీ తెలుసు. అయినా వివిధ కారణాల వల్ల, విశ్వాసాలవల్ల, ఇచ్చిన మాటలవల్ల, ఉంటున్న స్థితుల (పదవుల) వల్ల వాళ్లు కౌరవులను వీడలేకపోయారు. తమతమ మనస్సులకు విరుద్ధంగా (రోజూ చచ్చేయాతనపడుతూ) జీవిస్తున్నారు. కాబట్టి వాళ్లు చచ్చినట్లే. కాబట్టి వాళ్లందరినీ చంపాల్సిందే" ఎంత గొప్పగా చెప్పాడో చూడండి ఈ కరకుకఠోరనిత్య సత్యాన్ని గీతాకారుడు. రోజూ మనకళ్ల ముందరే ఎన్నో అన్యాయాలూ ఘోరాలూ జరుగుతూ ఉన్నాయి. మనం చూస్తూకూడ ఏమీ చేయలేకపోతున్నాం. తమ మానాన

తాము బతుకుతున్న క్రూరజంతువుల్ని, చేపల్ని, జింకల్ని, పందుల్నీ, గొర్రెల్నీ, నిలువునా చీల్చి, రోడ్డు మీద దుకాణం ముందు వేలాడదీసి, చర్మం ఒలిచి, ఎముకల్ని పోగుచేసి, మాంసాన్ని ముక్కలు ముక్కలుగా కోసి గ్రాములు గ్రాముల చొప్పున తూకం వేసి అమ్ముతుంటే క్యూలుకట్టి కొనుక్కుంటూ లొట్టలేసుకుంటూ తింటున్నాం. అది ఇష్టంలేని వాళ్లుకూడా ఏమీ చేయలేకపోతున్నారు. రోడ్డుమీద వెళ్లేటప్పుడు ఆ దుకాణాల దగ్గర తలతిప్పుకొని వెళ్లిపోవడం మినహా ఏమీ చేయలేకపోతున్నారు. మనంకూడా భీష్మద్రోణకర్ణాదుల్లా మనసు చంపుకొని బ్రతుకుతున్నవాళ్లమే! అందుకే భగవానుడు "భీష్మద్రోణాదులు నాచేత (ధర్మంచేత) చంపబడ్డారు అన్నాడు. (ఎలాగూ సందర్భం వచ్చింది కాబట్టి ఈ భాష్యకారుడు పాఠకులకు ఒక విజ్ఞప్తిచేస్తున్నాడు "రక్తమాంసాలున్న తోటి జీవులను చంపకండి. అవికూడా మనలాంటి వేనని భావించండి. దయజేసి జంతుజాలాన్ని కాపాడండి. భూత దయ చూపండి. పర్యావరణ సమతౌల్యాన్ని (Ecological balance) ను కాపాడండి.

ఇక్కడ ఇంకో కోణం కూడా ఉన్నది. ఇప్పుడు ఎండలు మండిపోతున్నాయి అనుకోండి "ఆఁ! ఈ ఎండలు ఇంకో నాలుగు నెలల్లో ఎలాగూ చనిపోతాయి" అనుకుని ఊరుకుంటామా ఈ రోజు ఎండ ప్రభావం తగ్గించుకునేటట్లు చెప్పులు, గొడుగు, ఖద్దరు, విసనకర్ర, ఫ్యాను, ఏసీ ఉపయోగించి "ఎండ" మీద యుద్ధం చేస్తాము. తర్వాత వానల కాలం వస్తుంది "ఆఁ! ఇవేం వానలు ఇంకోనాలుగు నెలల తర్వాత ఎలాగూ చనిపోతాయి" అని ఊరుకుంటామా గొడుగులు, వర్షపు జాకెట్లు వేసుకొని, నెత్తిన చేతులు పెట్టుకొని తడవకుండా జాగ్రత్తపడి వర్షంతో యుద్ధం చేస్తాము. ఆ తర్వాత చలికాలం వస్తుంది "ఆఁ! ఈ చలికూడా నాలుగు నెలల తర్వాత ఎలాగూ చనిపోతుంది" అనుకొని ఊరుకుంటావా, ఉన్నిబట్టలు, బుష్‌కోట్లు, తలకు టోపీ, అవసరమైతే మంకీ టోపీ, చెవులల్లోకి చలిగాలి పోకుండా చెవులకు అభ్యంతరాలు, కాళ్ళకు చలితగలకుండా సాక్సు, బూట్లు, చేతులకు చలి తగలకుండా 'గ్లౌసు' వేసుకొని మరీ చలితో యుద్ధం చేస్తాము. ఇదంతా ఎంత మామూలో అలాగే భీష్మద్రోణాది కర్ణులను చంపడం కూడా అంతే మామూలుగా జరగాల్సిందే. "ఎలాగూ ముసలోళ్లు అయినారు. మానసికంగా చచ్చారు. ఇంకో నాలుగైదేళ్లుంటే వాళ్లంతట వాళ్లే చస్తారులే" అని అనుకోకూడదు. అన్నాడు అర్జునునితో ఆపద్బాంధవుడు. న్యాయమూర్తి ముందు నిలబడిన దోషిని న్యాయమూర్తి "ఆ వీడు కూడా మరో 70, 80 ఏళ్లల్లో ఎలాగూ చస్తాడు కదా" అనుకొని శిక్ష వేయడం మాని వేస్తాడా ? నిర్భయ (జ్యోతీసింగు) ను యాతన పెట్టి చంపిన వాణ్ణి జూచి న్యాయమూర్తి "ఆఁ! వీడూ ఎలాగూ మరో 80, 85 ఏళ్లలో చనిపోయే వాడే కదా" అని వదిలి పెడతాడా...అలాగే కసబ్, ధనంజయ ఛటర్జీ... వగైరా... వగైరా... దోషులను వదిలిపెడతారా! కాబట్టి భగవానుడు పలికిన ఈ శ్లోకం చాలా గంభీర భావపూరితం!!

×××

ఇలా కృష్ణార్జునుల మధ్య జరుగుతున్న సంవాదాన్ని వింటున్న ప్రత్యక్ష శ్రోత సంజయుడు వార్తాదాత" గా మారి తన "శ్రోత" పాత్రను ధృతరాష్ట్రుడికి ఇచ్చి ఇలా అన్నాడు. "కృష్ణుడు ఇలా చెప్పిన తర్వాత ఒణికి పోతున్న అర్జునుడు కృష్ణుడికి నమస్కారాలు చేసి, గద్గద స్వరంతో మాట్లాడడం ప్రారంభించాడు.

ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య కృతాంజలిర్వేపమానః కిరీటీ।
నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం సగద్గదం భీతభీతః ప్రణమ్య॥ (11-35)

అజ్ఞానిని, విజ్ఞానిని చేసే భగవంతుని బోధను ప్రత్యక్షంగా వినే అదృష్టవంతుడైన సంజయుని జన్మధన్యం. "సంజయుడు" అనగానే ధృతరాష్ట్రుడికి యుద్ధరంగ విశేషాలను వినిపించే సంజయుడే కళ్లముందు ప్రత్యక్షమవుతాడు. ధృతరాష్ట్రుడు చెవులకు కళ్లను అతికించినవాడు సంజయుడు. తన మనోనేత్రానికి "దూరదర్శిని"ని అమర్చుకున్నవాడు సంజయుడు. అలాంటి సంజయుడు ఉన్నది ఉన్నట్లు, విన్నది విన్నట్లు, కన్నది కన్నట్లు పూసలుగుచ్చినట్లు సూక్ష్మాతి సూక్ష్మమయిన విషయాలనుగూడ పొల్లుబోకుండా, మరచిపోకుండా, తడబాటులేకుండా, పొరబాటు పడకుండా వివరిస్తున్నాడు. మళ్లా 'సీను' (కార్యరంగం) కృష్ణార్జునుల మధ్యకు వెళుతున్నది.

×××

ఓ కాల రూపవమా! ఓ 'కర్మ' రూపవమా! ఇంద్రియాలను నియంత్రించగలవాడా! 'కర్మ' రూపంలో శాశ్వితులను జేసేదీ నీవే, 'కాల' రూపంలో కబళించేదీ నీవే! జీవించదలచిన వారంతా నీ 'కర్మ' రూపానికి మొక్కి 'కర్మ' ద్వారానే శాశ్వితులవుతున్నారు అన్యులు నీ కాలరూపానికి వెరచి అందులోనే నిహితులౌతున్నారు.

స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ।
రక్షాంసి భీతాని దిశో ద్రవన్తి సర్వే నమస్యన్తి చ సిద్ధసంఘాః (11-36)

నిజం చెప్పాలంటే నీవే సృష్టి కర్త కంటే గొప్పవాడివి సృష్టికర్త సృష్టి మాత్రమే చేస్తాడు. నీవు కాలరూపుడవై వాళ్ళను లయం చేస్తావు 'కర్మ' రూపుడవై ఆయా వ్యక్తులను శాశ్వితులను చేస్తావు. సామాన్యులు నీ గొప్పతనం తెలుసుకోలేరు. వాళ్ళుఎందుకు నిన్ను ఆశ్రయించరో తెలియదు.

కస్మాచ్చ తే న నమేరన్మహాత్మన్ గరీయ సే బ్రహ్మణోఽప్యాదికర్త్రే ।
అనంత దేవేశ జగన్నివాస త్వమక్షరం సదసత్తత్పరం యత్ ॥ (11-37)

నీవే (పనే /కాలమే) దేవాది దేవుడు. నీవే ఆధారం. నీవే సర్వం. తెలుసుకోవాల్సిందంతా నీవే (పనే). ఈ సమస్తం నీతో నిండి ఉన్నది.

త్వమాదిదేవః పురుషః పురాణః త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।
వేత్తాసి వేద్యం చ పరం చ ధామ త్వయా తతం విశ్వమనంతరూప॥ (11-38)

నీవే వాయువు, నీవే యముడు, నీవే అగ్నివి, నీవే నీళ్లు, నీవే చంద్రుడు. అన్నీ నీవే అంతా నీవే అందుకే నీకు 'పని'కి, 'కాలానికి' మరలా మరలా గౌరవ పూర్వకంగా నమస్కారం చేస్తున్నాను.

వాయుర్యమోఽగ్నిర్వరుణ శ్శశాంకః ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ।
నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః పునశ్చ భూయోఽపి నమో నమస్తే (11-39)

నీవే సర్వ వ్యాపకుడివి. ముందూ నీవే. వెనుకా నీవే. ప్రక్కలందున నీవే. అపారశక్తివంతుడివి. సర్వమూ నీవే.

నమః పురస్తాదథ పృష్ఠతస్తే నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ ।
అనంతవీర్యామితవిక్రమస్త్వం సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః॥(11-40)

ఈ అర్జునుడి విశ్లేషణకూడా అత్యంత స్వాభావికం. ఈనాటికి కూడా అన్వయం చేయడానికి వీలుగా ఉంది. ప్రతి వ్యక్తీ, ప్రతి జీవి కాలం నోట్లో చిక్కుకోవలసిందే. "పని" ద్వారా శాశ్వితుడు కావల్సిందే. (సశేషం)

- మండుటెండల్లో మేఘానికి కోపం వస్తే ఏం చేస్తుంది? తన నీటితో నేలను చల్లబరుస్తుంది. సత్పురుషుల కోపం కూడా అంతే! అది మరొకరికి మేలు చేయడానికే ఉపయోగపడుతుంది.

# ఆచార్యముపసంగమ్య

..... బ్రహ్మశ్రీ బొడ్డుపల్లి పవన్‌కుమార్ అవధాని


**శ్లో॥ దృష్ట్వాతుపాండవానీ కంవ్యూఢందుర్యోధన స్తదా।**
**ఆచార్యముపసంగమ్య రాజావచనమబ్రవీత్॥ (అ.1 శ్లో 2)**

కురుక్షేత్రంలో మావాళ్ళు, పాండు పుత్రులు ఏమి చేస్తున్నారు ? అని ధృతరాష్ట్రుడు అడిగినప్పుడు సంజయుడు చెప్పనారంభించాడు. యుద్ధం ప్రారంభం కాబోతున్నది. పాండవ సైన్యాన్ని ద్రుపదనందనుడైన దృష్టద్యుమ్నుడు వ్యూహాకారంగా అమర్చి యుద్ధానికి సిద్ధమైనాడు. ఆ సైన్యాన్ని చూచిన దుర్యోధునుడు తన ఆచార్యుడైన ద్రోణాచార్యుల వారి వద్దకు వెళ్ళాడు. ''ఆచార్యముపసంగమ్య'' అంటే ఆచార్యునివద్దకు వెళ్ళటం అనితాత్పర్యం.

పాండవ సైన్యాన్ని పరికించి గాంధారేయుడు ద్రోణుని వద్దకు వెళ్ళటంలో ప్రత్యేకతవుంది. సహజంగా శత్రుసైన్యవ్యూహంపై చర్చించడానికి తన సైన్యాధ్యక్షుడైన గంగా సుతుడు భీష్మ పితామహుని వద్దకు వెళ్ళాలి. ప్రతి వ్యూహం ఏమిటో తెలుసుకోవాలి. ఇతరులను అందులకై వ్యూహం ఏమిటో తెలుసుకోవాలి. ఇతరులను అందులకై సహకరించమని కోరటం జరగాలి.

దుర్యోధనుడు ద్రోణుని వద్దకు వెళ్ళి తమ శిష్యుడైన ద్రుపదనందనుడు ఏర్పరచిన వ్యూహాన్ని చూడండి అని కోరటంలో ఆవ్యూహంమీరు నేర్పినదే కనుక దానిని ఛేదించే బాధ్యత మీదేనని గుర్తు చేయడం కావచ్చు. దుర్యోధనునికి యుద్ధంలో గెలుపే లక్ష్యం. సర్వ సైన్యాధ్యక్షుడైన భీష్ముడు వ్యూహం సంగతి చూసుకుంటాడు. భీష్మ పితామహుడు, కుంభ సంభవుడు ద్రోణాచార్యు లిద్దరూ పాండవులపట్ల అభిమానమున్నప్పటికీ రాజభక్తి కలవారు. రాజుకు ద్రోహం చేయాలనే ఆలోచన వారికిలేదు. రాదు. దుర్యోధనునికి వారిపైన విశ్వాసం వున్నప్పటికీ వారు తనకు మనస్ఫూర్తిగా సహకరించరేవెూ అనే అనుమానం వున్నది అనిపిస్తున్నది. పాండవ సైన్యంలోని ప్రముఖులను గురించి చెప్పి తన సైన్యంలో కూడా గొప్పవారే వున్నారని మీ శిష్యుడు చేసిన వ్యూహాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన గలరని తన గురువుగారికి అన్యాపదేశంగా చెప్పటం తన యోధులందరివల్లా తనకు విజయం చేకూరాలని కోరటం జరిగింది. శత్రుసైన్యం భీమునిచేత రక్షింపబడుతున్నదని, తన సైన్యం భీష్ముని చేత రక్షించబడుతున్నదని చెప్పి తన ఆధిక్యాన్ని ప్రదర్శించాడు కురుక్షితిపతి. కొంచెం పిరికి తనంవున్న వాళ్ళే ఇతరుల వద్దకు వెళ్ళి తమకు ఆధిక్యంవున్నట్లు చెప్పుకొని ఊరట చెందుతూవుంటారు. కౌరవాగ్రజుడు కూడా తన భీరుత్వాన్ని కప్పిపుచ్చుకొని, ఆదిక్యాన్ని ప్రదర్శించడానికి తన గురువు దగ్గరకు వెడలడం గమనార్హం. ఆచార్య ద్రోణులవారు కురు, పాండవులిరువురికీ గురుదేవులు కావడం విశేషం.●

# శ్రీరామ భక్తి



## 4. వాల్మీకి మహర్షి శ్రీరామ భక్తి

- కీ.శే. డాక్టర్ రోహిణి వెంకట సుందరవరద రాజేశ్వరి

**కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్।**
**ఆరుహ్య కవితాశాఖాం వన్దే వాల్మీకి కోకిలమ్॥**
**రామేతి పరికూజన్త మారూఢం కవితాలతామ్।**
**శృణ్వతో మోదయన్తం తం వాల్మీకిం కోన వన్దతే॥**

భగవన్నామ యశస్సును కీర్తించుటలో వాల్మీకి మహర్షి అద్వితీయుడు. శ్రీరాముని విశేషములను విశ్వమందు ప్రకటించిన కీర్తి వాల్మీకి మహర్షిదే. వాల్మీకి రామాయణమే ఆది కావ్యము లేక ఆదిరామాయణము. రాముని చరిత్ర కారులైన కవులందరికి శ్రీమద్వాల్మీకి రామాయణమే ఉపజీవ్యము. అందు చేతనే అందరు తమ రచన ప్రారంభమున వాల్మీకి మహర్షికి ప్రణామము లర్పించిరి. వేదములలో వర్ణించబడిన పరమతత్త్వమే శ్రీమన్నారాయణ తత్త్వమే శ్రీమద్రామాయణ మందు శ్రీరాముని రూపమున నిరూపించబడినది. వేదవేద్య పరమ పురుషోత్తముడు దశరథనందనుడగు శ్రీరాముని రూపమున నవతరించుటచే సాక్షాత్తుగా వేదములు ప్రచేత సపుత్రుడగు శ్రీవాల్మీకి మహర్షిచే చెప్పబడిన శ్రీరామాయణ రూపముతో ప్రకటమైనవి.

వాల్మీకి మహర్షి మొదట రత్నాకరుడు (అగ్నిశర్మ) అను దోపిడి దొంగ శ్రీ రామనామ జపముతో బ్రహ్మతో సమానముగ పూజ్యుడయ్యెను. వాల్మీకి రామాయణమందు మహర్షి వాల్మీకి దశరథ మహారాజు మంత్రులలో ఒకరని చెప్పబడినది.

శ్రీరాముడు వనమునకు వెళ్ళుచు చిత్రకూటములోని వాల్మీకి ఆశ్రమ మందు ఒక దినము గడిపెను. వాల్మీకి ఆశ్రమములు కొన్ని చిత్రకూట సమీపమునను, కొన్ని ప్రయాగ సమీపమునను, కొన్ని దూరక్షేత్రములందును గలవు. వాల్మీకి చాతుర్మాస్యవ్రత దీక్షలందు గడిపిన వివిధ స్థానములందును వాల్మీకి ఆశ్రమములు ఏర్పడినట్లు భావించవచ్చును. గోస్వామి శ్రీతులసీదాసునకు చిత్రకూటము చాలప్రియమైన దగుటచే ఎక్కువగా నిచటనే నివసించువాడు.

శ్రీరాముడు "వనవాస సమయము. గడుపుటకు ఉచితమైన స్థానమును చెప్పు" మని వాల్మీకి మహర్షిని ప్రార్థించెను.

వాల్మీకి మహర్షి రామునితో "మహారాజా! మీరులేని స్థానమేదియు నాకు కనిపించుటలేదు. ప్రభూ! మీరు బ్రహ్మ విష్ణుమహేశ్వరులను కూడ నాట్యము చేయించువారు. ధర్మము నశించునప్పుడు వేదమార్గమును రక్షించుటకు మీరు అవతరించెదరు. ఈ భగవతి సీతాదేవి మీ మహాశక్తి అయిన యోగమాయ. ఈ లక్ష్మణుడు సాక్షాత్తుగా శేషుని అవతారము. మీరు రావణాది రాక్షసుల వినాశలీల ప్రారంభించితిరి. రామా! మీ స్వరూపము 'వాణి'కి అగోచరము, బుద్ధికి అతీతము, అవ్యక్తము, అకథనీయము, అపారము, బ్రహ్మ, విష్ణు, శివులుకూడ మీ క్రియాకలాపముల రహస్యములను ఎరుగరు. మరి ఈ ప్రపంచమున ఎవరు మిమ్ములను తెలిసికొనగలరు ? ఒక వేళ మిమ్ములను తెలిసికొన గలభక్తులు ఉన్నచో అది మీకు వారిపై ఉన్న కృపా విశేషమే అగును" అని చెప్పుచు వాల్మీకి రామునకు నివాసయోగ్య స్థానములను ఈ విధముగా చెప్పెను.

"రామా! తృప్తి చెందక సదా ఉత్సాహముతో మీ చరిత్రను గ్రహించువారు మీ కథామృతమును తృప్తి చెందక సదావినునట్టి భక్తుల హృదయము మీ నివాస స్థానము. తమ నేత్రములతో (చాతకముల వలె) మిమ్ము దర్శించుటకు తపించు వారు మీ మంగళ మాయ విగ్రహమును స్వాతి చినుకువలె భావించి సదా దర్శించగోరు వారి హృదయము మీకు సర్వోత్తమమైన నివాసస్థానము.

ప్రభూ! మీ రామావతార చరిత్ర మానస సరోవరమందు ముత్యముతో సమానమైనది. ఎవని జిహ్వ నిరంతరము మీ చరిత్రను గ్రహించి ప్రవచించునో అట్టి వారి హృదయమందు దయతో అవశ్యము నివసించుడు.

ప్రభూ! మీ మందిరములు, మీరు తిరిగిన స్థలములు, ముఖ్యావతార ప్రాదుర్భావ స్థానములు, మీ లీలా స్థల పరిభ్రమణములో అలసట చెందక సదా సర్వత్ర మీ విశేషములను గాంచిన వారి హృదయమందు నిశ్చయముగ నివసింపుడు.

రామా! భగవానుని మీద ప్రేమ, వాని చరణముల యందు భక్తి సమానముగ పెరుగుచుండవలెను. ప్రేమ ప్రవాహము శిథిలముగాదు. భక్తి రూప సంపత్తి మాహాత్మ్యము తెలియును గనుక అది నిత్యము పెరుగుటకు ప్రయత్నింపవలెను. భక్తియే ఈ విశ్వమునకు సర్వాధిక మూల్య నిధి. అందుచేత మీరు దయతో సీతాలక్ష్మణులతో కలసి అట్టి భక్తుల హృదయమందు నివసింపుడు.

భగవత్కృతో భగవద్భక్తుల సర్వదోషములు నశించును. సూర్యుని యెదుట అంధకారము ఉండునట్లు వారి హృదయ మందు కామక్రోధలోభ మోహమదమాత్సర్యములకు స్థానములేదు. భక్తుడు నిత్యము భగవంతుని స్మృతినే తన సర్వస్వముగా భావించును. అతడు నిదురించినను మెలకువగ నుండినను భక్తి రూప సంపత్తిని రక్షించుకొనును. నిరంతరము భగవానుని జపధ్యానము నందే యుండును. భక్తుని హృదయమందు భగవానుడు భగవద్భజన తప్ప ఇంకేదియు ఉండదు. అందుచేత రఘువీరా! మీరు ఇట్టి భక్తజనుల హృదయములందు అవశ్యము నివసింపుడు.

హే భగవాన్! భక్తులకు వారి ప్రాణముల కంటె మీరే ప్రియమైన వారు. మీకు కూడ భక్తియే ప్రాణము కంటె అధిక ప్రియమైనది. ఇది గ్రహించిన వారే జ్ఞానులు. కృపాసింధూ! ఇట్టి భక్తుల నిర్మల హృదయమే మీకు శుభ మంగళమయ నివాస స్థానము.

మిమ్ములను తమ తల్లి, తండ్రి, స్వామి, సఖుడు, సంపత్తి, సర్వస్వముగా తలంచువారి మనో మందిరములందు మీరు సీతాలక్ష్మణులతో కలసి అవశ్యము నివసింపుడు.

ప్రభూ! ఎవరి దృష్టి యందు నరకము, స్వర్గము, అపవర్గము, సంసారములకు స్థానముండదో వారికి సదా సర్వత్ర దనుర్బాణములు ధరించిన మీరే దృష్టిగోచరమగుచుందురు. వారు ఎక్కడ తిరిగినను, ఎక్కడికేగినను, మీ సుందర సౌమ్యాకృతినే దర్శించెదరు. వారి మనస్సు, వాక్కు, కర్మలు సదామిమ్మే స్మరించును. మీపై ఇట్టి స్వాభావిక ప్రేమ గలిగిన భక్తుల హృదయములందు మీరు అవశ్యము నివసింపుడు, అదియే మీ గృహము".

వాల్మీకి ఈ విధముగ ప్రార్థించిన తరువాత తన ఆశ్రమమునకు కొద్ది దూరములోనున్న కామదగిరి సమీపమున మందాకినీ తీరమున నివసింపుమని చెప్పెను. అది అత్రి మహర్ష్యాది తపస్వులకు నివాసము.

రాముడు వాల్మీకి మహర్షి, అత్రిమహర్షి

37 వ పేజి తరువాయి ......




**రఘుమహారాజు ఔదార్యం**

రఘుమహారాజు విశ్వజిద్యాగం నిర్వహించి అందులో తనకున్న సమస్త ధనరాసులూ దానంచేసి ధనహీనుడయ్యాడు. అప్పుడు వరతంతుముని వద్ద సర్వవిద్యలూ అభ్యసించిన కౌత్సుడనే శిష్యుడు గురువుకు సమర్పించవలసిన దక్షిణ యాచించడానికై రాజు దగ్గఱకు వచ్చాడు.

అతిథి సేవపరాయణుడూ, కీర్తిమంతుడూ, సచ్ఛీలుడూ అయిన రఘువు తన వద్ద బంగారు పాత్రలు లేకపోవడంవల్ల మట్టిపాత్రలోనే పూజాద్రవ్యాలు పెట్టుకొని విద్యావంతుడైన అతిథికి ఎదురుగా వెళ్లాడు. శాస్త్రజ్ఞుడూ, మానదనులలో మొదటివాడూ, సత్కార విధానం చక్కగా తెలిసినవాడూ అయిన ఆ నరేంద్రుడు కౌత్సుణ్ణి ఉచితాసనంపై కూర్చోబెట్టి శాస్త్రవిధి ప్రకారం పూజించాడు.

తరువాత అతని చెంత చేతులను జోడించుకొని ఇలా అన్నాడు.

"ఓ కుశాగ్రమతీ! లోకానికి చైతన్యం కలిగించే సూర్యునిలాగా నీకు సమస్త జ్ఞానమూ కలిగించినవాడూ, మంత్రద్రష్టలైన ఋషులలో శ్రేష్ఠుడూ అయిన మీగురువు కుశలమేనా ? ఇంద్రుడు భయపడేటట్లుగా మనోవాక్కాయలచే సదా మీ గురువు ఆచరిస్తున్న త్రివిధ తపస్సులకూ ఎట్టి అంతరాయాల వల్ల నష్టం వాటిల్లడం లేదు గదా ! పాదులు చేసి నీళ్లు పోసి కన్నబిడ్డల లాగా ప్రేమతో మీరు పెంచగా పెరిగి మీశ్రమ పోగొడ్తున్న ఆశ్రమవృక్షాలకు గాలి మొదలైన వాటివల్ల ఎట్టి ఉపద్రవమూ లేదు గదా! (రాజుకివ్వవలసిన) ఆరవపాలి పరిగధాన్యపు రాసుల గుర్తులు గల ఇసుక దిబ్బలచెంత మీనిత్యస్నానాలకూ, పితృతర్పణాలకూ ఉపయోగపడుతూ వున్న తీర్థజాలాలకు లోటేమీ లేదుగదా!

ప్రేమాతిశయంతో మునులు అడ్డగించక పోవడంవల్ల వాళ్ళ అనుష్ఠానాని కుపయోగపడే దర్భలు మేసేవీ, ప్రసవానంతరం ప్రమాదనివారణకై బొడ్డుచేరులు ఊడిపడేవరకూ వాళ్ల ఒడిలోనే పెరిగేవీ అయిన జింకపిల్లలకు క్షేమమే గదా! అతిథులకు పెట్టడానికీ, మీసొంత జీవనానికీ ఉపయోగపడే అడవి నివ్వరిధాన్యాలు మొదలైనవాటిని చుట్టుప్రక్కల గ్రామాలనుండి వచ్చే పశువులు మేసిపోవటం లేదుగదా!

ఇతరాశ్రమాల కన్నిటికీ ఉపకరించే గృహస్థాశ్రమంలో ప్రవేశించటానికి నీకిది తగిన సమయం కదా! ప్రసన్న చిత్తంతో వరతంతు మహాముని నీకు విద్యలన్నీ నేర్పి ప్రస్తుతం గృహస్థాశ్రమ స్వీకారానికి అనుమతి యిచ్చాడా ? పూజ్యుడవైన నీవు నాచెంతకు వచ్చినంతమాత్రాన నాకు తృప్తిలేదు. నీ ఆదేశం నెరవేర్చటానికి నామనస్సు ఉబలాటపడుతున్నది. అడవినుండి నన్ను గౌరవించడానికి ఇక్కడికి నీవు మీగురువు గారి ఆజ్ఞ ననుసరించి వచ్చావా ? లేక నీ అంతట నీవే వచ్చావా?"

మిక్కిలి ఉదారంగా "నీ ఆజ్ఞ నెరవేరుస్తాను" అన్న రఘువు మాట విని కూడ మట్టిపాత్రను చూచి అతడు

త్యాగంవల్ల రిక్తుడై వున్నాడని గ్రహించిన కౌత్సుడు తన కోరిక నెరవేరుతుందనే ఆశ వదలుకొని అతనితో ఇలా అన్నాడు.

"రాజా! మాకన్నివిధాలా క్షేమమే. నీ పరిపాలనలో ప్రజలకు కీడు ఎలా కల్గుతుంది ? సూర్యుడు ప్రకాశిస్తూ వుండగా జనుల చూపును చీకట్లెలా ఆవరిస్తాయి ? ఓ సార్వభౌముడా! పెద్దలపట్ల భక్తి చూపడం మీకు కుల క్రమానుగతమైన సంప్రదాయం. ఈ విషయంలో నీవు నీపూర్వులను సైతం మించిపోయావు. ఐనా నేను కాలం మించిన తర్వాత యాచించటానికి వచ్చానే అని చింతిస్తున్నాను.

నరేంద్రా! అడవిలో మునులు మొదలైన వాళ్లు ఫలం పరిగ్రమించిన పిమ్మట దంటు మాత్రం మిగిలిన నివ్వరిసస్యంలాగా పాత్రులైన వాళ్ళకు ధనమంతా సమర్పించి నీవిప్పుడు శరీరమాత్రావశిష్టుడవై ప్రకాశిస్తున్నావు. భూమండలానికి ఏకచ్ఛత్రాధిపతివైన నీకు యాగంవల్ల కల్గిన ఈ పేదరికం యుక్తమే. వరుసగా దేవతలు అమృతపానం చేయడంవల్ల చంద్రుడి కళలు తరిగిపోవడ మనేది అవి పెరగడం కంటే కూడా ఎక్కువ శ్లాఘనీయంగదా! అందువల్ల గురుదక్షిణకోరి వచ్చిన నేను మరొక దాత నాశ్రయించి ఆ ధనం సంపాదించటానికి ప్రయత్నిస్తాను. నీకు శుభమగుగాక! కురిసి కురిసి వట్టిపోయిన శరత్కాలపు మబ్బును చాతకపక్షికూడా యాచించదుగదా!"

ఇలా చెప్పి అక్కడనుండి బయలుదేరడానికి సిద్ధమవుతున్న కౌత్సుణ్ణి రఘుమహారాజు ఆపి" ఓ విద్వాంసుడా! నీవు గురువుకు సమర్పించవలసిన వస్తువు ఏది ? అది ఏ పాటిది ?" అని ప్రశ్నించాడు.

అంతట విధ్యుక్త విధానంతో యాగాలు నిర్వహించినవాడూ, గర్వరహితుడూ, వర్ణాశ్రమ ధర్మపరిపాలకుడూ అయిన రఘుమహారాజుతో విద్వాంసుడైన ఆ బ్రహ్మచారి ఇలా చెప్పాడు.

"మహర్షివల్ల చదువులన్నీ నేర్చుకోవటం పూర్తికాగానే నేను ఆయన చెంతకు వెళ్లి గురుదక్షిణగా ఏమైనా స్వీకరించమని వేడుకొన్నాను. ఆయనపట్ల నేను చూపిన దుష్కరమైన భక్తినే గురుదక్షిణగా భావించిన ఆ మహానీయుడు తనకు ఇంకేమీ దక్షిణ ఇవ్వనక్కరలేదని చెప్పాడు.

నేను అంతటితో ఊరకుండక తప్పక ఏదైనా గురుదక్షిణ స్వీకరించి తీరవలసిందే అని మొండిపట్టు పట్టాను. దానితో గురువు కోపించి నేను దరిద్రుడనన్న సంగతి ఆలోచించకుండా తాను నేర్పిన పద్నాలుగు విద్యలకు గానూ పదునాలుగుకోట్ల ధనం దక్షిణగా తెచ్చి యిమ్మని ఆజ్ఞాపించాడు. అందువల్ల నేను నిన్ను ఆశ్రయించడానికి వచ్చాను. నీవు నాకు మట్టిపాత్రతో అర్ఘ్యమివ్వడం చూచి ధనమంతా దానం చేసి పేరుకుమాత్రం ప్రభువుగా మిగిలివున్నావని గ్రహించాను. నేను చెల్లించవలసిన గురుదక్షిణ కొద్దిపాటిదికాదు. అందుచేత ఈస్థితిలో నిన్ను ఇబ్బంది పెట్టడం నాకిష్టం లేదు."

వేదజ్ఞులలో శ్రేష్ఠుడైన కౌత్సుడు అలా చెప్పేసరికి చంద్రునివంటి కాంతిగలవాడూ, కాలుష్యం అంటనివాడూ, జగదేకప్రభువూ అయిన రఘుమహారాజు మళ్ళీ అతనితో ఇలా అన్నాడు.

"సకల శాస్త్రపారంగతు డొకడు గురుదక్షిణ కోరి రఘువు దగ్గరకు రావడమూ, అక్కడ తన కోరిక తీరక మరొక దాతను ఆశ్రయించడమూ అనే యింతకు మునుపుఎన్నడూ లేని యీ అపవాదు నాకు కలుగకుండుగాక! నీవు పవిత్రమూ, ప్రసిద్ధమూ

అయిన నా అగ్నిశాలలో త్రేతాగ్నులతో పాటు నాల్గవ అగ్నిలాగా వెలుగుతూ రెండు మూడు దినాలు ఓపికపట్టు. అంతలో నీపని నెరవేరుస్తాను."

అమోఘమైన ఆయన ప్రతిజ్ఞకు సంతోషించి బ్రాహ్మణుడు సరే అని అంగీకరిచాడు. భూలోకంలోని ధనసంపదనంతా అంతకుముందే రాబట్టుకొని వుండడంవల్ల రఘువు కౌత్సుడికి కావలసిన ధనం కుబేరుని వద్దనుంచి తీసుకురావాలనుకున్నాడు. వశిష్ఠమహర్షి చల్లిన మంత్రజల ప్రభావంవల్ల రఘుమహారాజు రథానికి గాలి చెలికాడైన మేఘునికి లాగా సముద్రంలోగాని, ఆకాశంలోగాని, పర్వతాలలోగాని గమనాటకం లేదుగదా! తర్వాత పరిశుద్ధుడూ, మహాధీరుడూ ఐన రఘువు కుబేరుణ్ణి ఒక రాజమాత్రునిగా భావించి పరాక్రమంతో జయించాలనుకున్నాడు. అస్త్రాలతో రథం సిద్ధంగా వుంచుకొని ప్రదోషసమయాన అందే శయనించాడు.

మరునాటి వేకువన రఘుమహారాజు సంగ్రామానికి బయలుదేరబోయే సమయంలో ఆశ్చర్యచకితులైన కోశాధికారులు వచ్చి రాత్రి ఆకాశం నుంచి కురిసిన బంగారు వానకు ధనాగారం నిండిపోయిందని తెలియజేశారు. తనపైకి దండెత్తనున్న రఘువుకోసమే కుబేరుడీకనకవర్షం కురిపించాడు. వజ్రాయుధపు వ్రేటుకు చీలికూలిన మేరుగిరిశిఖరం మాదిరి గుట్టగా పడివున్న హేమరాశి నంతటినీ స్వీకరింపుమని రాజనగా గురుదక్షిణగా సమర్పింపవలసిన విత్తంకంటె కించిత్తు కూడా పెచ్చువద్దని కౌత్సుడన్నాడు. అడిగినదానికంటే అధికంగా ఇస్తున్న దాతనూ, అవసరమైన దానికంటే ఎక్కువ వద్దంటున్న అర్థినీ అయోధ్యాపుర వాసులందరూ ఎంతగానో అభినందించారు.

ఈ విధంగా సమర్పించిన ధనాన్ని నూర్లకొలది ఒంటెలమీదా, గోడిగలమీదా ఎక్కించి రఘువు మునిముందర నమ్రుడై నిలిచాడు. అందుకు ప్రతిచెందిన కౌత్సుడు రాజును చేతితో నిమురుతూ ఇలా అన్నాడు.

''రాజా! నీవు రాచనడవడిని క్రమం తప్పక అనుసరిస్తున్నావు. అంచేత నీవు కోరిన అర్థాన్ని భూమి ప్రసవించడంలో ఆశ్చర్యంలేదు. ఆకసంగూడ నీ యిష్టార్థాన్ని పిదుకుతున్నదంటే నీ ప్రభావం ఊహించడానికే వీలు కావడంలేదు. సకల శ్రేయస్సంపన్నుడవైన నీకు మరొక శుభం చేకూరవలెనని ఆశీర్వదించడం అనవసరం. స్తవనీయుడవైన నిన్ను నీ తండ్రి కన్నట్లే నీవూ అనురపుడూ, గుణవంతుడూ అయిన కుమారుణ్ణి పొందుదువుగాక!"

## పాఠకులకు మనవి

ప్రియ పరిపూర్ణాత్మ బంధువులైన **కాలజ్ఞానసుధ** పాఠకులకు విజ్ఞప్తి. ముద్రణ మరియు పేపరు ధర పెరిగినందువలన **2015 అక్టోబరు** నెల నుండి **విడి ప్రతి : రు. 10/-** **సంవత్సర చందా : రు. 100/-** **లుగా** పెంచడమైనది. కనుక పాఠకులు గమనించ గలరు.

**గమనిక :** పాఠకులకు నెల మొదటి వారములో పత్రిక చేరని యెడల ఫోన్ చేసి తెలుపగలరు.

**సెల్ : 99491 32469**

# మహాభారతంలోని నీతి కథలు

.. డాక్టర్ కె. సత్యనారాయణ
సెల్: 9440732210

మానవుడు అంచెలంచెలుగా ఎదగాలంటే ఆజ్ఞాపాలన చాలా ముఖ్యం. ఆజ్ఞాపాలన విధేయతకు మారుపేరు. ఈ విధేయత ఉన్నవారు భౌతిక, ఆధ్యాత్మిక రంగాలలో చాలా విశేషమైన ప్రగతిని సాధిస్తారని పెద్దలంటారు. అలాంటి వృత్తాంతమే మహాభారతం ఆదిపర్వంలోని ఈ కథ.

మహాభారతకాలంలో అయోదధౌమ్యుడనే ఒక ఋషి నివసిస్తూ ఉండేవాడు. అతనికి ఆరుణి, ఉపమన్యుడు, వేదుడు అనే ముగ్గురు ప్రధాన శిష్యులుండేవారు. గురువు ఒకరోజు ఆరుణిని పిలిచి పొలంలో నీల్ళు పోతున్న రంధ్రాన్ని మూయమని పంపించాడు.

ఆరుణి గురువు గారి పొలానికెళ్లి, ఆ పొలానికున్న రంధ్రాన్ని మూసివేయడానికి ప్రయత్నం చేశాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినా పొలంలోని ఈ నీరు అంతకంతకూ ఎక్కువగా పోసాగింది. గురుభక్తిపరుడైన ఆరుణి గురువుగారిని మనసులోనే స్మరించుకుని ఆ నీటి రంధ్రానికి అడ్డంగా పడుకున్నాడు. దాంతో నీటి ప్రవాహం ఆగింది. చల్లటినీరు శరీరాన్ని కొరుక్కుతింటున్నా ఏ మాత్రం చలించలేదు ఆరుణి. ఆశ్రమంలోని గురువుగారైన అయోదధౌమ్యుడు శిష్యుల్ని పిలిచి "ఆరుణి ఎక్కడికెళ్లాడు ?" అని ప్రశ్నించాడు. అందులకా శిష్యులు "గురువర్యా! తమరే కదా! ఆరుణిని పొలానికున్న రంధ్రాన్ని పూడ్చుమని పంపారు" అని అంటారు. గురువు వెంటనే "ఆరుణిని వెతుకుదాం పదండి" అని శిష్యుల్ని వెంటేసుకుని బయలు దేరతాడు, పొలం సమీపానికెళ్లి "నాయానా! ఆరుణీ! ఎక్కడున్నావురా ? ఇటురా" అని గొంతెత్తి పిలవడంతోనే గురువుగారి మాట విన్న ఆరుణి వెంటనే పరిగెత్తి గురువు పాదసన్నిధికి వెళ్ళి ప్రణమిల్లుతాడు. "ఏమిటి నీవు చేస్తున్న పని ?" అని గురువు ధౌమ్యుడు ప్రశ్నిస్తాడు. గురువర్యా! "మీరు చెప్పినట్లుగా పొలానికున్న నీటి రంధ్రాన్ని మూయలేకపోయాను. అందుకని నేనే ఆ రంధ్రానికి అడ్డంగా పడుకున్నాను. మీ పిలుపు విని లేచి వచ్చాను. ఏమిటి ఆజ్ఞ?" అని వినయంగా నిల్చుంటాడు. పరమానందభరితుడైన గురువు నాయనా ? నీ భక్తికి, సాహసానికి మెచ్చాను. నీవు పొలం గట్టును పెకలించుకుని (ఉద్ధలించుకుని) వచ్చావు కనుక ఇక నుండి ఉద్దాలక మహర్షిగా ప్రశంసింపబడ్తావు. అంతేగాక నా ఆజ్ఞ పాటించావు గనుకు నీకు శుభం చేకూరుతుంది. సమస్తవేదాలు, ధర్మశాస్త్రం నీకు కరతలామలకమౌతాయి అని ఆశీర్వదించి పంపాడు.

అయోదధౌమ్యుడి మరో శిష్యుడు ఉపమన్యుడు. ఇతను మంచి గురుసేవా తత్పరుడు. ఒకరోజు గురువుగారు ఉపమన్యుని పిలిచి "నాయనా ఉపమన్యా! గోవులను రక్షిస్తూ ఉండు" అని చెప్తాడు. గురువు చెప్పిందే తడవుగా ఉపమన్యుడు రోజంతా చక్కగా గోవులను మేపి సాయంకాలం గురువును దర్శించుకుంటాడు. అప్పుడు గురువు అతనిని చూసి "పుత్రా! నీవు లావుగా, ధృఢంగా కనిపిస్తున్నావు. ఏమి తింటున్నావు ? అని ప్రశ్నించాడు. "రోజా భిక్షమెత్తుకుని తింటున్నానని" ఉపమన్యుడు సమాధానం చెప్పాడు. "నీవు నాకు నివేదించకుండా భిక్ష స్వీకరించకూడదు." అని గురువుగారు నియమం పెట్టారు. శిష్యుడు

గురువు ఆజ్ఞను శిరసావహించి భిక్ష తీసుకొచ్చి ఆశ్రమంలో విడిచిపెట్టి గురువు దగ్గరకు వెళ్లాడు. శిష్యుణ్ణి చూసిన గురువు "నాయనా! నీవు తెచ్చిన భిక్ష అంతా నేనే స్వీకరిస్తున్నాను మరి నీవు ఏం తింటున్నావు ?'' అని ప్రశ్నించాడు. అందుకు ఉపమన్యుడు "గురుదేవా! మొదటిసారి సంపాదించిన భిక్ష మీకు సమర్పించి మళ్లీ రెండోసారి సేకరించిన భిక్షను నేను స్వీకరిస్తున్నానన్నాడు. అది విన్న గురువు "శిష్యుడు అలా చేయడం తగదు ఇతర భిక్షార్థుల జీవితానికి ఇది ఆటంకం కల్గిస్తుంది'' అని అంటాడు. ఉపమన్యుడు గురువు గారి మాటను తలదాల్చి గోవులను మేపడానికి వెళ్లిపోతాడు. సాయంకాలం యథావిధిగా గోవులను తోలుకొస్తాడు. "ఉపమన్యూ! నీ భిక్ష అంతా నేనే తీసుకుంటున్నాను. నీవు బలంగా, చురుకుగా కన్పిస్తున్నావు ఏం తింటున్నావు ?'' అని గురువు మళ్లీ ప్రశ్నిస్తాడు. ఆవు పాలు త్రాగి జీవిస్తున్నానని బదులిస్తాడు. దానినికూడా గురువుగారు "నా ఆజ్ఞ లేకుండా ఆవుపాలు త్రాగకూడదు'' అని అంటాడు. ఆ ఆజ్ఞను కూడా శిరసావహించాడు శిష్యుడు. మళ్లీ రోజూ వారీ లాగనే గోవులను మేపుకుని వచ్చిన శిష్యుని చూసి గురువు మళ్లీ ఇది వరకు లాగనే ప్రశ్నించాడు. ఉపమన్యుడు "గురువర్యా! లేగదూడలు తల్లిపొదుగు నుండి పాలు త్రాగేటపుడు పై కెగిరిన నురుగును త్రాగి జీవిస్తున్నానని'' అంటాడు. అందుకు గురువు "అయ్యయ్యో! ఆ లేగదూడల ఆహారానికి ఆటంకం కల్గిస్తునట్లున్నావు. నీవు ఆ నురుగును కూడా త్రాగకూడదు'' అన్నాడు. గురువుగారు ఈ సారి చెప్పిన మాటను కూడా పాటించాలని నిర్ణయించుకున్నాడు ఉపమన్యుడు. మళ్లీ మరుసటి రోజు గోవులను తోలుకెళ్లాడు. ఆకలితో నకనకలాడుతున్న అతనికి ఆ అడవిలో ఏం త్రాగడానికి తినడానికి లేకపోయేసరికి జిల్లేడు ఆకుల్ని తిన్నాడు. ఫలితంగా కంటి చూపు పోయి గ్రుడ్డివాడైపోయాడు. దారి కన్పించక ఒక పెద్ద బావిలో పడిపోయాడు. సాయంకాలం అయింది. శిష్యుడు ఇంకా ఆశ్రమానికి రాకపోవడాన్ని గమనించిన గురువు శిష్యుల్ని వెంటబెట్టుకుని అడవికి బయలుదేరాడు. "నాయనా ఉపమన్యూ! ఎక్కడున్నావయ్యా'' అని పెద్దగా అరుస్తుండగా గుర్తుపట్టిన ఉపమన్యుడు తాను నూతిలో పడిపోయానని అరిచి చెప్పాడు. నూతి నుండి బైటకు తీసిన పిదప నూతిలో ఎలా పడ్డావని అడిగితే జిల్లేడు ఆకులు తిన్నానని బదులిచ్చాడు. గురువు శిష్యుని అశ్వినీదేవతలను స్తుతించమని అంటాడు. శిష్యుడలాగే చేస్తాడు. అశ్వనీ దేవతలు ప్రత్యక్షమై ఒక అపూపాన్ని ఇచ్చి తినమంటారు. గురువుకు నివేదించనిదే తాను వారి ఆజ్ఞ పాటించలేనంటాడు ఉపమన్యుడు అందుకు అశ్వినీదేవతలు ఇంతకు ముందు నీ గురువుస్తుతిస్తే ఒక అప్పాన్ని ఇచ్చాము. కానీ ఆయన వారి గురుదేవులకు నివేదించకుండా స్వీకరించాడు. కనుక నీవు కూడా నీ గురువుకు నివేదించనవసరం లేదని ఉపమన్యునికి సూచిస్తారు. కానీ ఉపమన్యుడు అందుకు అంగీకరించలేదు. అప్పుడు ఆ అశ్వినీదేవతలు సంతోసించి "నాయనా ఉపమన్యూ! నీ గురుభక్తికి సంతోషించాము. నీ దంతాలు స్వర్ణమయంగా తయారౌతాయి. నీకు చూపు వస్తుంది అన్నివిధాలా శుభం కల్గుతుంది'' అని దీవించి అంతర్థానమౌతారు. ఉపమన్యుడు గురువు చెంతకు వెళ్ళి జగిరినదంతా చెప్తాడు. ధౌమ్యుడు చాలా సంతోషించి "నాయనా! ఆ దేవతలు చెప్పినట్లుగా నీకు శుభం చేకూరుతుంది. వేదాలు, ధర్మశాస్త్రాలు అన్నీకూడా నీ బుద్ధికి వాటికవే స్ఫురిస్తాయి'' అని ఆశీర్వదించి పంపాడు.

కావున ఆజ్ఞాపాలన ఎంత విశిష్టమైందో మనకు తెలుస్తుంది. ●

# దైవ భక్తి

.... శ్రీమతి రావూరి ఇందుమతి,
యం.ఏ., తెలుగుపండిట్,
నరసరావుపేట, సెల్ : 95337 21776

గోపికి బామ్మతప్ప మరెవరూ బంధువులులేరు. తను పురిటిలో ఉండగానే తల్లిని కోల్పోయాడు. భార్యపోయిన దిగులుతో తండ్రికూడా కొన్నాళ్ళకే చనిపోయాడు. మిగిలింది బామ్మ. బామ్మ ఆ పసికందును తీసుకుని బ్రతుకు తెరువు కోసం పాలు, పెరుగు, మజ్జిగ అమ్మి ఆ పసివాణ్ణి పెంచుతుండేది. గోపికి బామ్మే చిన్నతనం నుండీ రామాయణం, భారత, భాగవతాలలోని పద్యాలను చెప్పేది. చందమామ కథలు, నీతికథలు చెప్పేది. శతకాలలోని పద్యాలన్నీ అలవోకగా నోటికి వచ్చేటట్లు నేర్పింది. గోపికి ఐదవ సంవత్సరము రాగానే వీధిబడిలో చేర్పించింది. తనకున్న దాంట్లోనే పిల్లలందరికి పలకా బలపాలు పంచి పప్పుబెల్లాలు పెట్టింది. గురువు గారి చేత అక్షరాభ్యాసం చేయించింది . గోపిబడిలో అందరికన్నా చదువులో ముందుండేవాడు. అలా ఉండటానికి కారణం తన బామ్మే.

రోజు బామ్మ పాలు, పెరుగు మజ్జిగ అమ్మటానికి వెళ్ళేది. తను, గోపి ఇంత చద్దన్నంతిని వెళ్ళేవారు. బామ్మగోపికి ఎన్నెన్నో మంచి బుద్ధులు, క్రమశిక్షణ నేర్పింది.

వేకువఝామున నిద్రలేవటంతోనే శ్రీకృష్ణా! వాసుదేవా! దేవకీ నందనా! నందగోపకుమారా! గోవిందా! పంక జనాభా! పద్మలోచనా! పద్మమాలికాలంకృతా! పద్మసంకాశ శరణా! హృషీకేశా! ఈశా! పాహిమాం, పాహిమాం పాహీ అనీ రామచంద్రారక్షమాం, రక్షమాం అనీ శివ పంచాక్షరీ మంత్రం ఓం నమః శివాయః అంటూ నిద్రలేచేవాడు. కాలకృత్యాలు ముగించుకుని దేవతార్చన చేసుకుని అవ్వపెట్టిన బువ్వతిని బడికి వెళ్ళేవాడు.

గోపి బడికి వెళ్ళాలంటే అడవిదాటి ఊర్లోకి వెళ్ళాలి. అరణ్య మార్గం భయంగా ఉండేది గోపికి. భయమేసి బామ్మ మాటలు గుర్తుకువచ్చి కన్నయ్యా! కన్నయ్యా! కాపాడరావయ్యా! అంటూ వేడుకుంటూ వెళ్ళేవాడు. కన్నయ్య ఆ బాలుడి మొరవిని వెంటనడుస్తూ గోపితో కబుర్లు చెప్తూ బడికి చేర్చేవాడు. అలారోజు గోపికి కృష్ణుడు కన్పించి కబుర్లు చెప్తూ, ధైర్యం చెప్తూ పాఠశాలకు వెళ్ళేవారు. ఇంటి దగ్గర బామ్మకూడా ''లావొక్కింతయు లేదు ధైర్యంబు విలోలంబయ్యెననీ'', ''కలుగడే మాపాలి కలిమి సందేహింప'' అంటూ దేవుణ్ణి ప్రార్థిస్తూ భుక్తి కోసం భక్తిగా తలంచుతు వెళ్ళేది.

ఓ రోజు గోపి స్నేహితులతో కలసి అడవిమార్గంగుండా బడికి బయలుదేరాడు. కొంతదూరం వెళ్ళేటప్పటికి జంతునాదాలు విన్పించి భయమేసి కన్నయ్యను తలచుకుంటున్నాడు. గోపీ! ఎవరితోరా నీవు మాట్లాడేది ? నీకు మతి ఏమైనా చలించిందా ? లేక పోతే ఏమా కబుర్లు ? ఏమా మాటలు ? అని సంగడీలు ఎగతాళి చేశారు. మా బామ్మ చెప్పిందిరా. భయమేసినప్పుడు కన్నయ్యను తల్చుకుంటే కాపాడతాడని. అందుకే నా వెంటవచ్చి మనల్ని కాపాడుతున్నాడురా లేకపోతే మనము ఈపాటికి ఏ జంతువుకో 'ఫలహారం' అయ్యేవారము అని స్నేహితులతో చెప్పాడు. వాళ్ళుగలగల నవ్వి నీతో వస్తుంటే మాకూ మతిభ్రమిస్తుంది రా! నీతో

మేమురాము. కన్నయ్యలేడు గిన్నయ్యలేడు. మేం వస్తాం నీవు నీ కన్నయ్యతో కబుర్లు చెబుతు మెల్లగా రా. నీకు గురువుగారితో తన్నులుంటాయని వెళ్ళిపోయారు. గోపి అలా నడుచుకుంటూ వెళ్ళేటప్పటికి బడికి ఆలస్యమయింది గురువు గారు గోపి చేప్పే సంజాయిషీ వినకుండానే గోపీని బాగా దెబ్బలు కొట్టారు. స్నేహితులు తగిన శాస్తి జరిగిందని నవ్వుకున్నారు. సాయంత్రం ఇంటికి వెళ్ళి బామ్మకి జరిగిందంతా వివరించాడు. బామ్మ ఏడ్చుకుని ఎవరేమనుకున్నా, ఎన్ని కష్టాలు వచ్చినా భగవంతుణ్ణి మరువద్దునాయనా! ఆయనే మనల్ని కాపాడతాడు. 'ఏది ఒక్కసారి దైవనామస్మరణ' చేయినాన్నా వింటాను అన్నది.

జయ హాలాహల భక్షక! జయమృత్యుంజయా!
జయశాశ్వత! నీలకంధరా! నీ హారధరాధరేంద్రా!
చింత్యా చింత్యా! జయ ముకుందా! జయ
గిరీశా! జయ కైలాసవాసా! జయము జయమో
ప్రభూ! రక్షించుమోదండ్రీ! నిన్ను నమ్మినాను

అంటూ వేడుకున్నాడు. గురువుగారి దెబ్బలు వెనువెంటనే మాయమయ్యాయి ఆ రాత్రి ఇద్దరూ హాయిగా నిదురించారు.

ఓ రోజు గురువుగారి భార్యకు జ్వరమొచ్చింది.

బిషక్కులను పిలిపించి ఎన్ని మందులను వాడినా తగ్గలేదు. క్రమేపి పెద్దదై మంచానపడ్డది. గురువుగారు దిగులుతో ఆలోచిస్తూండగా విద్యార్థులు చెప్పిన గోపి సంగతి గుర్తుకు వచ్చి గోపిని యింటికి పిలిపించుకున్నాడు గురువుగారు. ఏరా! గోపీ! నీకు కృష్ణుడు కన్పిస్తాడటగదా! మీ అమ్మగారి జబ్బును నయం చేయరా నాయనా! నీకు పుణ్యం ఉంటుంది అన్నాడు. గోపి అమ్మగారి మంచం దగ్గర చతికిలబడి అమ్మదీనావస్తను చూసి ఏడుస్తూ అమ్మా! అమ్మా! లేండమ్మా! పరిపరి విధాలా దైవాన్ని వేడుకుంటున్నాడు గోపి.

శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగార రత్నాకరా!

లోకద్రోహి నరేంద్ర వంశదహనా! లోకేశ్వరా! దేవతా నీక బ్రాహ్మణ గోగణార్తి హరణా! నిర్వాణ సంధాయకా!

నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యాను కంపానిధీ!

అని భగవంతుణ్ణి ప్రార్థించగా కొంచెం ఆగాక ఏదో ఓ శక్తి ఆమెలో ప్రవేశించింది. ఆమె జబ్బు మటు మాయమైంది.. ఎప్పటిలా తనకేమీ జరగనట్లే గబగబా లేచి కబుర్లు చెప్తుంది. గోపి పసిమనసుకి, దైవభక్తికి కన్నయ్య చలించిపోయాడు గురువుగారి భార్యను మన్నించి బ్రతికించాడు. అప్పుడు గురువుగారు గోపిదైవభక్తికి ఆశ్చర్యపోయాడు. క్రమేపి గోపి పెద్దవాడై పెద్దచదువులు చదివి మంచి ఉద్యోగం సంపాదించి గురువుగారి మన్నలను పొందాడు. గురువుగార్ని గోపీఎన్నడూ మరచిపోలేదు. అలాగే గురువుగారు కూడా మంచి విద్యార్థిని మరువలేదు. ఓ శుభముహూర్తాన గురువుగారి ఆశీస్సులతో వివాహం చేసుకున్నాడు. బామ్మ తనుపడ్డ కష్టం ఇప్పుడు ఫలించిందని ఆ దేవునికి మనసులోనే నమోవాకములర్పించింది. గోపి ఇప్పుడు గోపీకాదు. గోపాలకృష్ణ. భార్యలీలతో లీలాకృష్ణగా పేరొందాడు. దైవభక్తికి మించిన బాంధవుడుండడని నిరూపించాడు నలుగురు బిడ్డలతండ్రి గోపాల కృష్ణ!

గురువుగారి దంపతులకు సంతానంలేని కారణంగా గోపి కుటుంబాన్ని తమ వద్దే ఉండమని కోరాడు.

గురువుగారి కోర్కెను మన్నించి వారికి సంతానంలేని లోటును తీర్చాడు. గోపి పిల్లలను తన మనమళ్ళు మనవరాళ్ళుగా భావించాడు గురువుగారు. బామ్మను తన తల్లి పగిది గౌరవించారు. క్రమేపి గురువుగారి దంపతులు దిగులు మరచి హాయిగా ఉంటున్నారు.

కాలగమనంలో ఓ ఇరువై ఏళ్ళు గడచిపోయాయి. గురువుగారి దంపతులు పెద్దవారయ్యారు. వారి పనులుకూడా లీలా గోపీలే చూసుకుంటున్నారు. గురువుగారి భార్య ఓ రోజు గోపీని పిల్చి నాయనా! నాకు భగవంతుని కథలు వినాలనుంది విన్పించవా ? మనసు హాయిగా ఉంటుంది అని అడిగింది. అప్పుడు గోపీకృష్ణ భాగవతంలోని పలు ఘట్టాలను చదివి విన్పించాడు. శ్రీకృష్ణుడు భక్తులను రక్షించిన ఘట్టాలన్నీ చక్కగా చదివాడు. భగవంతుని రూపగుణాదులను కళ్ళకు కట్టినట్లు వినపిస్తున్నాడు గోపి. ఆమె విస్మయంతో వింటుంది.

కమనీయ శుభగాత్రు గంజాత దళనేత్రుఁ
వసుధా కళత్రుఁ భావన చరిత్రు
సత్యసంకల్పు నిశాచరోగ్ర వికల్పు
వతపనాగకల్పు నాగతల్పు
గౌస్తుభ మణి భూషు గంభీర మృదుభాషు
శ్రితజనపోషు వంచిత విశేషు
నీలనీరదకాయు నిర్జితదైతేయు
దృతపీతకౌశేయు వతవిధేయు

నగమహోగదవేద్యు వేదాంతవేద్యు
దివ్యముని సన్నుతామోదుఁ తీర్థపాదు
జిష్ణు వర సద్గుణాలంకరిష్ణుఁ గృష్ణుఁ
జూడు దైతేయ కులబాల! శుబగలీల!

గోపీ అలా ప్రహ్లాద చరిత్రను గురుపత్ని వీనుల విందుగా పద్యాలను వింటూ తన కనుల ముందు సాక్షాత్కరించిన మూర్తిని మదిలో భావిస్తూ...

కృష్ణ! పరమాత్మ! యదుకుల కీర్తి వార్ధి
పూర్ణచంద్రమ! దేవకీపుత్ర! సుజన
వినుత! నారాయణాత్యుత! వేదవేద్య!
భక్తజన పోషపరితోషిత! పరమపురుష!

వస్తున్నా స్వామీ! అంటూ భర్త వచ్చి ఏమైందని ఆమెని తన ఒడిలో కూర్చోపెట్టుకుని అడుగుతున్నాడు. అంతలో ఆమె ప్రాణాలు విష్ణ లోకానికి పయనమైపోయాయి. భార్యప్రాణాలు వదలటం చూసి భర్త ప్రాణాలు కూడ వైకుంఠపుర మేగాయి. గోపీ దంపతులు గురువుగారి దంపతులకు తిలోదకాలర్పించి తల్లీదండ్రీ తమకికలేరు అని భోరున విలపించారు. ఎన్ని సంపదలున్నా 'దైవభక్తి' కిమించిన సంపదలు లేవని గోపి దంపతులు భావించారు. ●

- ఆనందం అనేది మనల్ని అనుసరించే నీడ లాంటిది. దాన్ని అందుకో వాలని పరుగిడితే, అది ముందుకు పోతూనే ఉంటుంది. మన మార్గంలో మనం నడుస్తూ పోతే అది మనల్ని అనుసరించి వస్తుంది. అంతేకాని అది పూర్తిగా మనిషికి అందదు. అలాగని అందకుండాను పోదు.

- సూర్యకిరణాల స్పర్శతో మంచు తన కాఠిన్యాన్ని కోల్పోతుంది. క్రమంగా ద్రవరూపాన్ని పొందుతుంది. అలాగే సత్పురుషుల సాంగత్యంలో మనలోని దుర్గుణాలు దూరమౌతాయి. చివరికి ఋజువర్తనం మాత్రమే మిగులుతుంది.

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు

## ఉండవల్లి గుహలు (గుంటూరు జిల్లా - ఆంధ్రప్రదేశ్)

శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

ఉండవల్లి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో గుంటూరు నుంచి 20 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ విష్ణుకుండిన రాజుల కళాప్రావీణ్యానికి ప్రత్యక్ష నిదర్శనాలుగా ఉండవల్లి గుహలున్నాయి. ఈ గుహలు ఉత్తరాభిముఖముగా ఉన్నాయి. బయట నుంచి చూస్తే ఈ గుహలను మదపుటేనుగులు మోస్తున్నట్లు కనిపిస్తుంది.

పూర్వము విశ్వామిత్ర మహర్షి యజ్ఞము చేసేటప్పుడు ఆ యజ్ఞ కుండలముల వరుస తీగవలె తిన్నగా ఉండడంవలన ఈ గ్రామానికి 'కుండవల్లి' అని పేరొచ్చింది. అదే క్రమముగా 'గుండ్లవల్లి', 'ఉండవల్లి' గా మార్పు చెందిందని తెలియుచున్నది.

క్రీ.శ. 2వ, 3వ శతాబ్దాలో బౌద్ధమతం ప్రాచుర్యం పొందుతున్న రోజుల్లో వీటిని నిర్మించి ఉండవచ్చును. ఆనంద గోత్రికులు పరిపాలించే కాలంలో విష్ణుకుండినులు బౌద్ధ భిక్షువుల కోసం వీటిని నిర్మించి ఉండవచ్చు. బౌద్ధరామాలు నిర్మించిన గోవిందశర్మ ఈ గుహలను నిర్మించినట్లుగా తెలియుచున్నది.

క్రీశ. 14వ శతాబ్దంలోని రెడ్డి రాజుల శాసనం ప్రకారం క్రీశ. 1265లో అన్నారెడ్డి కుమారుడు యాచమరెడ్డి పద్మనాభస్వామికి దానాలు చేసినట్లు చరిత్రాధారాలను బట్టి తెలుస్తుంది.

పూర్వం ఇవి బౌద్ధులు తపస్సు చేసుకోవటానికి వీలుగా ఉండేవని అవేక్రమంగా హిందూదేవాలయాలుగా మార్పు చెందాయని చెబుతారు.

విష్ణుకుండిన వంశీయులే ఆంధ్రలో గుహలను తొలచి దేవాలయాలు నిర్మించారు.

ఇక్కడ నాలుగు అంతస్తులలో తొలచబడిన 64 గుహలున్నాయి. ఇవి అన్నీ ఒకే రాతిలో తొలచబడటం విశేషం.

మొదటి అంతస్తులో 11 గుహలు కలవు. ఈ అంతస్తులోని కుడివైపు గుహలో శివుడు కొంతకాలం తపస్సు చేశాడని చెబుతారు. రెండవ అంతస్తుకు వెళ్లేమెట్ల దారిలో సొరంగమార్గం ఉంది. ఇది గుహల నుండి మంగళగిరి పానకాల స్వామి ఆలయం వరకు 9 కి.మీ. పొడవునా భూగర్భమార్గం ఉండేది. బౌద్ధభిక్షువులు, కృష్ణానదిలో స్నానమాచరించి మంగళగిరి కొండపైన గల పానకాల స్వామిని దర్శించి పూజలు నిర్వహించి ఉండవల్లి గుహలకు చేరుకొని తపస్సు చేసుకొనేవారని చెబుతారు. గతంలోని కొంతమంది ఈ గుహలోని మార్గంలోకి కొంత దూరం వెళ్లి విషవాయువులు వస్తుండటంతో వెనుదిరిగి వచ్చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ మార్గాన్ని మూసివేశారు. సొరంగానికి ఎదురుగా రెడ్డి రాజుల కాలం నాటి శిలాశాసనం ఉంది.

రెండవ అంతస్తులో 16 స్తంభాలు, 6 గదులున్నాయి. 3 గదుల్లో విగ్రహాలు కలవు. చారిత్రక ఆధారములను బట్టి ఇక్కడున్న శాసనం క్రీ.శ 1278వ సంవత్సరానికి చెందినదని తెలియుచున్నది. ఇక్కడ విఘ్నేశ్వరుడు, బ్రహ్మ, మహేశ్వరుడు, నృసింహస్వామి, రావణ మండపము, సీతాదేవితో

హనుమంతుడు, మాట్లాడుట మొదలగు శిల్పాలు పురాణ గాథలకు నిదర్శనం, ఈ అంతస్తు బయట గుహలకు ఇరువైపుల పెద్ద తొండముగల ఏనుగు శిరస్సులు కలవు.

మూడవ అంతస్తులో 18 స్తంభాలు, నాలుగు వరుసలలో ఉన్నాయి. వీటిపై రామాయణ, మహాభారతములకు సంబంధించిన అనేక శిల్పాలున్నాయి. ఉగ్రనరసింహస్వామి, పరమశివుని ఆద్యంతాలను నిర్ధారించేందుకు బ్రహ్మ విష్ణువులు తలక్రిందులుగా ఉండటం, బలిచక్రవర్తిని వామనుడు పాతాళానికి అణచడం మొదలైనవి ఉన్నాయి. ఇక్కడ 25 అడుగుల పొడవు, 56 అడుగుల వెడల్పు, 5 అడుగుల ఎత్తు కలిగి గ్రానైట్ రాతితో చెక్కబడి ఉత్తర దక్షిణాలుగా శేషపాన్పుపై పవళించిన అనంత పద్మనాభస్వామి విగ్రహం ఉంది. స్వామి వారి విగ్రహం ఇలా ఉండటానికి ఓ కథ ప్రచారంలో ఉంది. ఒకసారి విష్ణుమూర్తి ధనం లెక్కబెడుతుండగా అలసట వచ్చి ధనం ఉన్న బిందెమీదే నిద్రించాడట. ఈ విగ్రహం అదే భంగిమలో ఉంది. స్వామి శిరస్సు వద్ద గరుత్మంతుడు పాదములవద్ద జయ విజయులు, నాభి నుండి జన్మించిన బ్రహ్మవిగ్రహముతో పాటు శ్రీదేవి భూదేవిలతో విష్ణుమూర్తి, ఆదిశంకరులు, పరశురాముడు మొదలగు విగ్రహాలు సందర్శకులను ఆకర్షిస్తాయి. ఈ అంతస్తు బయట ఖాళీ స్థలములో ఎడమ నుండి వరుసగా విశ్వామిత్ర, వాల్మీకి, వశిష్ట, నారద విగ్రహాలున్నాయి. నారదునికి ఇరువైపుల రెండు సింహాల విగ్రహాలు కూడా ఉన్నాయి.

నాలుగవ అంతస్తులో రెండు గుహలున్నాయి. ఇక్కడ శిల్పాలులేవు. ఈ గదుల్లో మునులు తపస్సు చేసుకొనేవారని చెబుతారు.

క్రీ.శ. 1958లో పురావస్తు శాఖ వారు ఈ గుహలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ గుహలుపైకి ఎక్కి చూస్తే గుహలకు సమీపంలో పరవళ్ళు త్రొక్కుతున్న కృష్ణానది, చుట్టూ పచ్చటి చెట్లతో ఉన్న ప్రకృతి దృశ్యాలు యాత్రికులకు నయనానందాన్ని కలుగజేస్తాయి.●

---

27 వ పేజి తరువాయి ......

ఆశ్రమముల మధ్య తన వనవాసమునకు నివాస స్థానము నిర్మించుకొనెను.

ఈ విధముగ వాల్మీకి మహర్షి జీవితమే రామమయమైనది. రామభక్తితో అందరికి సందేశమెనగి తన జీవితమును సఫలముగావించుకొనెను. సర్వత్ర అనంత గుణగణ నిలయుడగు శ్రీరామభగవానుని గుణగాథను, దయను భక్తవత్సలతను వర్ణించి తన వాక్కులను పవిత్రము గావించుకొనెను. శ్రీమద్వాల్మీకి రామాయణ మందు ఆయన గూఢ భక్తి ప్రస్ఫుటిత మగును. అతడు ఒకచోట.

"ప్రభూ! అగ్ని మీ క్రోధము. చంద్రుడు మీ ప్రసన్నతా స్వరూపము. మొదట వామనావతారమందు మీరు పరాక్రమముతో మూడు లోకములను లంఘించితిరి. బలిని బంధించి ఇంద్రుని రాజుగావించితిరి. భగవతి సీతాలక్ష్మి, మీరు ప్రజాపతి విష్ణువు. రావణవధ కొరకు మీరు మనుష్య శరీరమందు ప్రవేశించితిరి. ఈ కార్యము మీరే నెరవేర్చవలెను.

దేవా! మీ బలవీర్య పరాక్రమములు సర్వధా అమోఘములు. శ్రీరామా! మీ దర్శనము స్తుతి అమోఘములు. పృథ్విపై మీ భక్తులు కూడ అమోఘమైనవారే. పురాణపురుషోత్తమా! శ్రీరామా! మీ యందు భక్తితో, మిమ్ము ఉపాసించువారికి ఈ లోకమునందు, పరలోకమునందు దుర్లభమైనదిలేదు" అని వ్రాసెను. ●

# వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు

డా॥ టి. చంద్రశేఖరం, తిరుపతి. 9701181966

(గత సంచిక తరువాయి)

**50. సమస్త వ్యాధులు నశించుటకు :** ఉసిరిక పులుపు, తుంగముస్తైలు ధనియాలు, వర్షపునీరు, చెరుకు రసం, నెయ్యి, త్రిఫల చూర్ణము సమభాగాలుగా కలుపుకొని పూటకు 3 తులాలు చొ॥న తినుచుండిన సమస్త వ్యాధులు హరించును.

**51. గుంటగలగర రసాయనము :** 1) గుంటగలగరాకును నీడన యెండించి చూర్ణము చేసినట్టిది 5 భాగములు, మిరియాల పొడి 3 భాగములు, త్రికటచూర్ణము (శొంఠి, మిరియాలు, పిప్పళ్లు) 2 భాగములు, అక్కల కర్రపొడి 2 బాగములు మొత్తం అన్నీ కలిపి ఒక సీసాలో పోసుకొని ప్రాతః కాలమునందు మూడు వేళ్లకు వచ్చినంత చూర్ణమును తేనెతో కలిపి కలుపుకొని సేవించిన వాత, పిత్త, శ్లేష్మముల వలన కలిగిన క్షయ రోగములు, కుష్టురోగములు హరించిపోవునని మహాత్ముల ఆజ్ఞ. 3) లేత గుంటగలగరాకును పచ్చడి చేయించి ప్రతి నిత్యమూ అన్నములో కలుపుకొని తినుచుండిన శరీరమునకు బలము కలుగును.

**52. దేహ దారుఢ్యమునకు :** రోజుకు 2 ఆకుల వంతున సరస్వతి ఆకులు తినుచుండిన ఎడల శరీరపుష్టి, దీర్ఘాయువు లభించును.

## 5. గోమాత విశిష్టత

వేదకాలం నుంచి నేటి వరకు భారతీయులకు గోవు అత్యంత పవిత్రమైనది, ఆరాధనీయమైనది గోవును కామధేనువుగా పూజిస్తాం.

“గౌర్నవదాస్పష్టవ్యా” - గోవును, కాలితో తాకరాదు అని ధర్మశాస్త్రం చెబుతుంది. ఆవునెయ్యి పవిత్రమైన హోమద్రవ్యం. యాగాలు చేయడానికి ఆవుపెరుగు, ఆవుపాలు, ఆవునెయ్యి ఎంతో అవసరం. దానికై మన పూర్వీకులు ఆవును శ్రద్ధగా పోషించేవారు, ఆవుపాలు, పెరుగు, నెయ్యి, మూత్రము, గోమయము (ఆవుపేడ) - వీటిని పంచగవ్యములు అని అంటారు.

మహాభారతకాలములో అంపశయ్యపై వున్న భీష్ముడు ధర్మరాజుకు అనేక ధార్మిక విషయాలు భోధించే సమయములో ఆవులను గురించి భీష్ముడు చెప్పిన అద్భుతమైన సత్యవాక్కులు నాటికీ, నేటికీ, ఏనాటికీ మానవజాతికి శిరోధార్యములవుతాయి. ఆవులే త్రికాలములను భూతవర్తమాన-భవిష్యత్తులో అనాదిగా ఆయువును, పుష్టిని అందిస్తున్నాయి. ఆవులే లక్ష్మీకరము, ధనానికి, సర్వశుబాలకి మూలం. కావున ఆవుల నిమిత్తం చేసిన దానం వలన మనకు ప్రాప్తించిన పుణ్యం ఎన్నడూ వ్యర్థం కాదు.

సర్వభూతములలో గోవులు పరమ పవిత్రమైనవి. అందుకే సర్వప్రాణులలో గోవులు ఉన్నత స్థానమును పొందియున్నవి.

శాంతి స్వభావము గలది, పుణ్యస్వరూపము గలది, పుణ్యములను చేకూర్చునవి. సమస్త కోరికలను తీర్చునవి. గోవులు వాటి పంచగవ్యములతో(పాలు, పెరుగు, నెయ్యి, మూత్రము, పేడ) జగత్తుకే ప్రాణదానము చేస్తున్నవి. ఆ పవిత్ర గోవుల నిమిత్తం దానము చేయు వ్యక్తి తన సమస్త మనోభీష్టాలను పొందగల్గుతాడు.

“గావః ప్రతిష్ఠా భూతానం తథా గావః పరాయణమ్
గావః పుణ్యేపవిత్రాశ్చ గోదానం పావనమ్ తథా”

“ప్రాణులన్నింటిలో గోవులే గౌరవ ప్రదమైనవి, మరియు పరమార్థసాధకములు. గోసేవయే పుణ్యము మరియు పవిత్రము. అట్లే గోధానమే శారీరక, మానసిక ఆరోగ్యములనిచ్చు పరమ పావన ఔషధము. - వేదవ్యాస మహర్షి (మహాభారతము)